J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 34 26.01.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## రాముడొచ్చాడు..ఇక

# రామరాజ్యం రావాలి

### అరుదైన ఆధ్యాత్మిక హేల
### హిందూత్వానికే కొత్త కళ
### నెరవేరిన 5 శతాబ్దాల కల



'దాదాపు అయిదు శతాబ్దాల నాటి కల సాకారమై.. ఎట్టకేలకు అయోధ్య రామమందిరం ప్రారంభం కావడం, ఇనకులసోముడైన ఆ రఘురాముని దివ్యరూపం మేఘవర్ణంలో అపురూపంగా సాక్షాత్కరిస్తూ అయిదేళ్ళ బాలునిగా.. బాల రామునిగా అవతరించి, అత్యద్భుతంగా నిర్మించిన భవ్యమైన ఆలయంలో పద్మపీఠంపై ప్రాణప్రతిష్ట చేసుకోవడం, ఒకచేతిలో స్వర్ణధనుస్సు..మరొకచేతిలో బంగారు బాణం, పసిడికాంతుల పీతాంబరాలతో, ధగధగా మెరిసిపోతున్న వజ్రవైఢూర్యాలు..స్వర్ణాభరణాలు, మణులు, కెంపులు ముత్యాలతో సూర్యదేవుని చిహ్నంతో పొదిగిన కిరీటధారణతో, వజ్ర తిరునామంతో, మహావిష్ణువు అవతారంగా భావిస్తూ బాలరాముని హృదయపీఠంపై కౌస్తుభ మణి అలంకరణతో, స్వర్ణాభరణాల దివ్యాలంకారంతో,.. సుగంధభరిత పుష్పాలంకృతుడై దేదీప్యమానంగా భాసిస్తూ బాలరాముడు అయోధ్యలో అవతరించిన ఘట్టం..అద్భుతం, అపురూపం, చరిత్రాత్మకం. ఆ మహత్కార్యం రామభక్తుడైన ప్రధాని మోడీ చేతులమీదుగా 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా జరగడం ప్రపంచవ్యాప్తంగా భారతీయుల హృదయాలను పులకింపజేసింది. సకలగుణాభి రాముడైన ఆ సాకేతరాముడే అవనిపై తిరిగి అవతరించడంతో హిందువుల మనసులు ఆనందతరంగితమయ్యాయి. 10 లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు సం/-

## రాజన్నా క్షమించు...

# రచ్చకెక్కిన 'రాజ'కుటుంబం

- రసకందాయంలో రాష్ట్ర రాజకీయం
- అన్నని అల్లరల్లరి చేస్తున్న చెల్లెలు
- బాబుకి కలిసొస్తున్న పొరుగింటి పోరు

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అంటే రెండు తెలుగురాష్ట్రాలలో ఒక రాజకీయ బ్రాండ్. ఈ రెండు రాష్ట్రాల రాజకీయాలకు సంబంధించినంత వరకు 'రాజకుటుంబం' అంటే రాజశేఖరరెడ్డి కుటుంబమే. 10 లో





# శ్రీసిటీలో ప్రపంచశ్రేణి వసతులు

## • ట్రైనీ ఐఏఎస్‌ల ప్రశంస

భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2023 బ్యాచ్‌కు చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు జనవరి 22న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వారిని స్వాగతించి, శ్రీసిటీలోని ప్రపంచశ్రేణి మౌళిక వసతులు, ప్రత్యేకతలతో పాటు దేశంలోని భారీ పారిశ్రామిక పార్కులలో ఒకటిగా శ్రీసిటీ ఎలా ఆవిర్భవించిందో వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రగతి మార్గదర్శకమని, శ్రీసిటీలోని మౌళిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం అద్భుతమని ట్రైనీ ఐఏఎస్‌ల బృందం నాయకుడు కొనియాడారు. ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటనపట్ల తన సందేశంలో సంతోషం వ్యక్తంచేసిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అనేకమంది అధికారులు, వ్యూహకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. ఈ పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు.

## శ్రీసిటీ ప్రగతి అద్భుతం



ఏపీ గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సమాఖ్యకు చెందిన 35 మంది సభ్యుల ప్రతినిధి బృందం, ఆ సంస్థ ఛైర్మన్ జి.ప్రకాశం యాదవ్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ టి.దామోదర్‌నాయుడు నేతృత్వంలో ఈనెల 23న శ్రీసిటీని సందర్శించింది. విభిన్న పరిశ్రమలకు నిలయమైన శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని నేరుగా వీక్షించి, పలు అభివృద్ధి అంశాలను తెలుసుకున్నారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ (ప్రభుత్వ సంబంధాలు) వి.భగవాన్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం వారు శ్రీసిటీ పరిసరాలను సందర్శించి, అక్కడ వ్యాపారానుకూల వాతావరణాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. వివిధ రంగాలు, వివిధ దేశాలకు చెందిన అత్యుత్తమ తయారీ పరిశ్రమలను శ్రీసిటీకి తీసుకొచ్చి, భారీ ఉపాధి అవకాశాలను కల్పించడం పట్ల శ్రీసిటీ యాజమాన్య కృషి అద్భుతమంటూ వారు ప్రశంసించారు.

# రజకులకు అండగా ఉండేది టీడీపీ ఒక్కటే

**- అబ్దుల్ అజీజ్**



రజకులకు అండగా ఉండేది తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని, టీడీపీ అధికారంలోకి వస్తే రజకుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు మరింతగా కృషిచేస్తామని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ చెప్పారు. ఈనెల 21న టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర ఆధ్వర్యంలో నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని పోలంరెడ్డి గార్డెన్స్‌లో నెల్లూరు జిల్లా రజకుల చైతన్యసభ జరిగింది. ఈ సభకు అజీజ్ జ్యోతి వెలిగించి మాట్లాడుతూ, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెల్లూరు నగరంలో రజకుల భవన్ ఏర్పాటుచేస్తామని, మరమ్మతులకు గురైవున్న దోబీఘాట్‌లను బాగుచేయిస్తామని, రజకుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఆశీర్వదించి అఖండ విజయం చేకూర్చాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రజక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ జి.రామకృష్ణ, న్యాయవాది శ్రీధర్, నాయకులు పొదిలి శ్రీనివాసులు, కప్పిర శ్రీనివాసులు, బాబు, యానాదయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదారుపల్లి గంగమ్మకు పల్లకి సేవ

నెల్లూరు శివారుల్లోని పదారుపల్లిలో గ్రామదేవత గంగమ్మ అమ్మవారికి ఈనెల 21న కన్నుల పండువగా పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కాకుటూరు శ్రీహరియాదవ్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉభయకర్తలుగా పులి రమణయ్య-సుగుణ, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా వచ్చేసింది

## • జిల్లాలో మహిళలదే ఆధిక్యత

**మొత్తం ఓటర్లు 19,08,498 మంది**

**పురుషులు : 9,35,195, మహిళలు : 9,73,089**

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తాజాగా ఈనెల 22న భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని 8 శాసన సభ నియోజకవర్గాల్లో తుది ఫోటో ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 2317 పోలింగ్ కేంద్రాల పరిధిలో 19,08,498 మంది ఓటర్లు జాబితాలో నమోదయ్యారని, వీరిలో 9,35,195 మంది పురుషులు, 9,73,089 మంది మహిళలు, ఇతరులు 214 మంది ఉన్నారని పేర్కొన్నారు.



### నియోజకవర్గాల వారీగా వివరాలు

జిల్లాలోని కందుకూరు నియోజక వర్గంలో 2,26,646 మంది, కావలిలో 2,34,119, ఆత్మకూరులో 2,12,860, కోవూరులో 2,61,111, నెల్లూరు సిటీ 2,37,622, నెల్లూరు రూరల్ 2,67,671, సర్వేపల్లి 2,29,102, ఉదయగిరిలో 2,38,555 మంది ఓటర్లు జాబితాలో నమోదై వున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 18-19 మధ్య వయస్సు గల వారు 36,175మంది, 20-29 మధ్య వయస్సులు 3,12,440 మంది, 30-39 మధ్య వయస్సు కలవారు 4,93,451 మంది, 40-49 మధ్య ఉన్నవారు 4,29,668 మంది, 50-59 ఏళ్ళ మధ్య వయస్సున్న వారు 3,13,492 మంది, 60-69 మధ్య వయస్సు కలవారు 1,96,829 మంది, 70-79 మధ్య సంవత్సరాల మధ్య వయస్సు గలవారు 97,004 మంది, 80 సంవత్సరాలు వయస్సు పైబడినవారు 28,849మంది ఉన్నట్లు ఈ జాబితాలో వెల్లడించారు.

### 36 వేలకు పైగానే కొత్త ఓటర్లు :

జిల్లాలో సుమారు 36 వేలకు పైగా కొత్త ఓటర్లు నమోదయ్యారని, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, ఇసిఐ వెబ్‌సైట్ ద్వారా ప్రతిఒక్కరూ తమ ఎపిక్ కార్డు ఆధారంగా తమ ఓటును చెక్ చేసుకోవచ్చని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. సంక్షిప్త సవరణ 2024 నిరంతర ప్రక్రియ అని, నామినేషన్‌కు వారం ముందువరకు కూడా వచ్చిన ఓటరు అప్లికేషన్లను పరిశీలించి నమోదుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

| అసెంబ్లీ నియోజకవర్గం | కేంద్రాలు | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| 1. కందుకూరు | 271 | 1,12,304 | 1,14,437 | 24 | 2,26,765 |
| 2. కావలి | 314 | 1,15,058 | 1,19,144 | 28 | 2,34,230 |
| 3. ఆత్మకూరు | 278 | 1,04,821 | 1,08,110 | 8 | 2,12,939 |
| 4. కోవూరు | 324 | 1,26,326 | 1,34,836 | 20 | 2,61,182 |
| 5. నెల్లూరు సిటీ | 248 | 1,16,184 | 1,21,486 | 66 | 2,37,736 |
| 6. నెల్లూరు రూరల్ | 275 | 1,30,358 | 1,37,367 | 25 | 2,67,750 |
| 7. సర్వేపల్లి | 284 | 1,11,496 | 1,17,613 | 30 | 2,29,139 |
| 8. ఉదయగిరి | 323 | 1,18,648 | 1,20,096 | 13 | 2,38,757 |
| మొత్తం | 2,317 | 9,35,195 | 9,73,089 | 214 | 19,08,498 |

## గంగపట్నం చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఇందుకూరుపేటలోని గంగపట్నంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి ఈనెల 21న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్, రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ళు వండి నైవేద్యంగా సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## కొమరికలో దహనవాటికకు శంకుస్థాపన

ఇందుకూరుపేట మండలంలోని కొమరిక గ్రామంలో ఎంతోకాలంగా వర్షా కాలంలో పార్ధివదేహాలకు దహనసంస్కారం చేయడానికి ఇబ్బందిగా ఉండడంతో ఆ గ్రామస్తుడు, ప్రవాసభారతీయుడు ఇందుపూరు పవన్‌కుమార్‌రెడ్డి దాతృత్వంతో అన్ని వసతులతో దహనవాటిక నిర్మాణం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు దహనవాటిక నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశారు. గ్రామపెద్దలు గూడూరు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ చెన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా నాయకులు గూడూరు శివకుమార్‌రెడ్డిల సమక్షంలో ఈ శంకుస్థాపన జరిగింది. దీంతో గ్రామస్తులు దాత సేవలను అభినందిస్తున్నారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి




అర్హులైన పేదలందరూ కేంద్రప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి చెప్పారు. ఈనెల 21న నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న లెక్చరర్స్ కాలనీలో ఏర్పాటుచేసిన 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, దేశంలో పేదల అభ్యున్నతి కోసం ప్రధాని నరేంద్రమోడీ ఎన్నోరకాల సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నారని, ఆ పథకాల పట్ల అవగాహన కల్పించుకుని పేదలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిలకా ప్రవీణ్‌కుమార్, మహిళా మోర్చా నాయకురాలు గంటా విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.


# కావలిలో 'సంయుక్త' సేవలు




కావలిలోని 'సంయుక్త సేవాసంస్థ' వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో మగ్గం, టైలరింగ్‌లో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు సర్టిఫికెట్లను ఇచ్చారు. రోటరీ క్లబ్ సభ్యులు బచ్చు వీరాస్వామి సహకారంతో నాలుగునెలల పాటు మహిళలకు ఉచితంగా ఈ శిక్షణ ఇచ్చి, వారి జీవనోపాధికి దారిచూపారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జయచంద్రనాయుడు పాల్గొని దాత వీరాస్వామిని అభినందించారు.

# 28న.. నగరానికొస్తున్న చంద్రబాబు!

## ఏర్పాట్లను పరిశీలించిన మాజీ మంత్రి సోమిరెడ్డి



తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జనవరి 28న నెల్లూరు పర్యటనకు వస్తున్నారు ఆరోజున 'రా..కదలి రా' సభకు ఆయన ముఖ్య అతిథి. నగరంలోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి కళాశాల మైదానంలో పెద్దఎత్తున జరగనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లను మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితర నేతలు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 23న వారు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలసి సభా ప్రాంగణ మైదానాన్ని పరిశీలించారు. చంద్రబాబు కార్యక్రమాల ఏర్పాటులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేయాలని పార్టీ వర్గాలకు సోమిరెడ్డి సూచించారు. 28వ తేది ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం అవుతుందని, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభంజనం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, ఈ సభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఆయన చెప్పారు. చంద్రబాబు సభ ఏర్పాట్ల పరిశీలనలో వారితో పాటు మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, కావలి నియోజకవర్గం టీడీపీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, తాళ్లపాక అనురాధ, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెన్ని రమణయ్య, బొమ్మి సురేంద్ర, పమిడి రవికుమార్ చౌదరి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాజానాయుడు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నన్నేసాహెబ్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ క్రీడాకారులు బాగా రాణించాలి

### ఎంపీ ఆదాల

గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో బాగా రాణించాలని నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆయన ఈనెల 24న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాట్ చేతపట్టి క్రికెట్ ఆడుతూ క్రీడాకారులను ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంతాలలోని యువతీ యువకుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మన క్రీడాకారులు రాణించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని నెల్లూరులోనూ దిగ్విజయంగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి, నగర మేయర్ పొట్లూరు స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆర్డీఓ మలోల, నగర కమిషనర్ వికాస్ మర్మత్, డీయస్డీఓ యతిరాజ్, ఏయంసీ ఛైర్మెన్ కోటేశ్వరరెడ్డి, స్థానిక డివిజన్ ఇన్చార్జ్ సన్నపురెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఎంపిడీఓ వీ.శైలేంద్రకుమార్ తదితరులతోపాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# 27న.. నెల్లూరుకొస్తున్న షర్మిల!

## ఘనంగా స్వాగతించాలన్న డీసీసీ నేత చేవూరు



జనవరి 27న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షురాలు, దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల నెల్లూరు పర్యటనకు వస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టాక ఆమె తొలిసారిగా నెల్లూరుకు వస్తున్న సందర్భంగా ఆమెకు ఘనంగా స్వాగతం పలకాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 24న నెల్లూరు ఇందిరా భవన్‌లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు, మండల అధ్యక్షులు, సమన్వయ కమిటీ నేతలతో చేవూరు సమావేశమై షర్మిల స్వాగత ఏర్పాట్లను చర్చించారు. షర్మిలతో పాటు పార్టీలోని మరికొందరు ముఖ్యనేతలు కూడా నెల్లూరుకు వస్తున్న సందర్భంలో వారందరినీ ఘనంగా స్వాగతించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, వైఎస్ఆర్ అభిమానులు అందరూ పెద్దసంఖ్యలో తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్ర ప్రజలకు ఆరాధ్యదైవంగా నేటికీ చెరిగిపోని స్థానాన్ని సంపాదించుకున్న దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ బిడ్డగా షర్మిల పీసీసీ అధ్యక్షురాలి హోదాలో తొలిసారిగా నెల్లూరుకు వస్తున్నారు కనుక, ఆ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తెచ్చేందుకు షర్మిల కృషి చేస్తారని, ఆమెకు అందరూ సహకరించాలని చేవూరు పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు చింతాల వెంకట్రావు, దుద్దులూరి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెవాసుల దాహం తీరుస్తున్న విపిఆర్



విపిఆర్ 'అమృతధార' పథకం ద్వారా జిల్లాలోని మారుమూల పల్లెల్లో సైతం వాటర్‌ప్లాంట్‌లను ప్రారంభించి పల్లెవాసుల దాహం తీర్చడంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిరంతరం చేస్తున్న నీటిసేవ మనకు తెలిసిందే! ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు ఆయన కావలి నియోజకవర్గంలో నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. బోగోలు మండలంలోని నాగులవరం, బంగారుపాళెం, జువ్వలదిన్నె గ్రామాలతో పాటు కావలి మండలంలోని సర్వాయపాళెంలో ఈ ప్లాంట్లను స్థానిక శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు.



## బాధ్యతలు చేపట్టిన సుధీర్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా చిల్లకూరు సుధీర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన సుధీర్‌రెడ్డిని జగన్ మోహన్‌రెడ్డి అదే సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. జనవరి 24వ తేదీ బుధవారం మంగళగిరిలోని సంస్థ కార్యాలయంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## తహాశీల్దార్ సస్పెన్షన్

నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలంలో తహాశీల్దార్‌గా పనిచేస్తున్న ఎన్.మల్లికార్జునరావు విధుల్లో అలసత్వం, పాలనకు అసౌకర్యం కలిగిస్తున్నందుకు ఆయన్ను సస్పెండ్ చేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఈనెల 24న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ స్థానంలో ఇన్‌చార్జి తహాశీల్దారుగా కొండాపురం తహాశీల్దారు శ్రీనివాసరావును నియమించారు.




ఆత్మీయ అభినందనలు

ప్రతిభకి ప్రతీకగా, వ్యాపార, ఆధ్యాత్మిక,
సేవా రంగాలలో ఆయన చేస్తున్న కృషికి గుర్తుగా
అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ బర్కిలి ద్వారా
యునైటెడ్ టెక్నలాజికల్ & రీసెర్చ్
విభాగం నుండి 'డాక్టరేట్' అందుకున్న
మా ఆప్తులు, ఆత్మీయులు, ఆత్మబంధువు
అరబిందోఫార్మా, డైరెక్టర్
డా॥ మెట్టు మదన్‌మోహన్‌రెడ్డి గారికి
ఆత్మీయ అభినందనలు.

ఆలూరు శివకుమార్‌రెడ్డి
మేనేజింగ్ పార్టనర్
SONU PHARMACEUTICALS
HYDERABAD.

# ‘మిధ్య’గా మారిపోతున్న..ప్రాథమిక విద్య!

‘చదువుకోక ముందు పెసలు పెసలు అనేవాడు.. చదువుకున్నాక పిసలు పిసలు అన్నాడట’ అని మనకో సామెత ఉంది. ఇప్పుడది అక్షరాలా నిజమనేట్లుగా ఉంది మన ప్రాథమిక విద్యా వ్యవస్థ. చిన్నతనం నుంచి మంచి చదువులు చదువుకోవడం ఆరంభిస్తే పెద్దయ్యాక విద్యార్థుల భవితకు అవి మేలు బాటలు వేస్తాయి. పునాది గట్టిగా ఉంటేనే ఇల్లు గట్టిగా ఉంటుంది. చదువుకు కూడా అంతే. అయితే, మన దేశంలో రానురాను ప్రాథమిక విద్యా వ్యవస్థ ఒక ‘మిధ్య’గానే మిగిలిపోతోంది. ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటేనే గొప్ప ఉద్యోగాలు వస్తాయని అనుకుంటూ మాతృభాషను విస్మరించే రోజులు వచ్చేశాయి. విద్యావ్యవస్థలోకి కూడా రాజకీయాలు చొచ్చుకురావడంతో అయ్యవార్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. పాతవన్నీ మార్చేద్దామని కొత్త ప్రభుత్వాలు అనుకుంటే, పాతవాటికి అలవాటుపడ్డ పిల్లలు కొత్తవాటిని అందుకోలేకపోతున్నారు. అందుకు తోడు బడుల్లో ఎక్కడ చూసినా సమస్యలే. మౌలిక వసతులు లేకపోవడం, పాఠాలు చెప్పే అయ్యోర్లు లేకపోవడం, ఉన్నా, వారు సరిగా బడులకు రాకపోవడం, వచ్చినా సక్రమంగా పాఠాలు చెప్పకపోవడం వంటి కారణాలతో ప్రాథమిక విద్య ఎదుగు బొదుగూ లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా తయారైంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లో పరిస్థితి ఇలాగే ఉంటోంది. అందులోనూ మన తెలుగు రాష్ట్రాల్లో చదువుల స్థితి మరింత ఘోరంగా ఉంటోంది. అధునాతన సౌకర్యాలు, ఇంగ్లీషు చదువుల మోజులో పాఠశాల విద్య అంతా వ్యాపారాత్మకంగా తయారైపోతోంది. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఆయా ప్రాంతాల్లో గుత్తాధిపత్యం సంపాదించి వేలకువేలు ఫీజులు గుంజుకుంటున్నాయే తప్ప విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడంలేదు. ప్రభుత్వ పాఠశాలలు చాలాచోట్ల నామమాత్రంగానే నడుస్తున్నాయి తప్ప ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. రెండో తరగతి విద్యార్థుల పుస్తకాల్లో ఉన్న పదాలను, వాక్యాలను కూడా సరిగా పలకలేక సతమతమవుతున్నారని, అనేక సంవత్సరాలుగా ఎలాంటి వృద్ధీ కనిపించడం లేదని తాజాగా పాఠశాల విద్యా స్థితిగతులపై నిర్వహించిన ఓ సర్వే పేర్కొంది. అయితే ఆ సర్వేలో

లాయర్
జనవరి 26, 2024

పాల్గొంది రెండో తరగతి పిల్లలు కాదు.. పది, ఇంటర్ విద్యార్థులే. పేరుకు ఇంటర్ చదువుతున్నా రెండో తరగతి పుస్తకాల్లోని పదాలను కూడా పలకలేకపోవడం, లెక్కలు(గణితం) అంటేనే భయపడిపోవడం, సైన్స్‌లో ఏమాత్రం ఆసక్తి లేకపోవడం వగైరా లోపాలను గమనించి పాఠశాల విద్య ఇంత అస్తవ్యస్తంగా తయారైపోయిందా అని ఆ సర్వే కూడా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దీన్నిబట్టి దేశంలో విద్యార్థులు, ముఖ్యంగా తెలుగువారు తమ మాతృభాషను ఎంతగా విస్మరిస్తున్నారో తేటతెల్లమవుతుంది. పాలకుల నిరాసక్తత, అధికార గణం నిర్లిప్తతతో గత కొన్నేళ్లుగా పిల్లల చదువులు అలా చట్టుబండలవుతూనే ఉన్నాయి. బడుల్లో సాధారణ విద్య చెప్పడానికే అనువుగాని పరిస్థితుల్లో ఇక నాణ్యమైన చదువులకు చోటెక్కడ?.. నైతిక విద్యకు తావెక్కడ?.. పుట్టిన బిడ్డ కూడా ఇప్పుడు సెల్‌ఫోన్ కావాలంటున్న మాయదారి కాలమిది. స్మార్ట్ ఫోన్లు వినియోగించుకోవడంలో, ఆన్‌లైన్ వీడియోలో చూడడంలో ఆరితేరిపోతున్న అనేకమంది విద్యార్థులు చదువులో మాత్రం శ్రద్ధ చూపడం లేదని, ఫోన్ల వినియోగంలో ఉన్న పరిణితి చదువుల్లో ఉండడం లేదని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తల్లితండ్రుల బలవంతం వల్లనో, లేదా అయ్యవార్ల వత్తిడితోనో ఎవరైనా చదువులో కాస్త ప్రతిభతో ఉన్నారంటే ఆ ప్రతిభ ఉద్యోగం పొందడానికే తప్ప, జీవితాన్ని సార్థకం చేసుకునే విధంగా ఆ పరిజ్ఞానం ఉపయోగపడడం లేదు. ‘మొక్కై వంగనిది..మానై వంగునా’ అన్నట్లుగా చిన్నతనంలోనే మంచేదో చెడేదో తెలియక అయోమయంలో పడిపోతే ఆ తర్వాత వారి జీవితాలు కూడా అస్తుబిస్తుగానే ఉంటాయి.

అయినా, నేటి ఆధునిక కాలంలో విజ్ఞానం లేకుంటే అసలు బతకడం కష్టం. బాగా చదువుకుంటేనే కదా విజ్ఞానం?.. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభాపాటవాలను, నైపుణ్యాలను కనిపెట్టి వారిని మంచి విద్యావేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క గురువులకే ఉంటుంది. కానీ, ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా కళ్ళు తెరచి, పిల్లలు బడుల్లో బాగా చదువుకునే వాతావరణం కల్పించాలి. అదేవిధంగా, సమస్యలు తిష్టవేసి ఉన్న బడుల బాగుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా వెంటనే కేటాయించాలి. పాఠశాలల్లో కొరత లేకుండా అయ్యవార్లను నియమించాలి. నేటి బాలలే..రేపటి పౌరులు కనుక, చదువులో ఏమాత్రం మన బాలలు వెనకబడకుండా రాణించేలా.. తద్వారా భవిష్యత్తులో దేశపురోభివృద్ధికి వారంతా సహకరించేలా ప్రాథమిక స్థాయిలోనే తీర్చిదిద్దుకోవాలి.

# గెలిచేదెవరో?.. ఓడేదెవరో?

ఎన్నికలు తరముకువస్తున్న నేపథ్యంలో ఎవరు గెలుస్తారో..ఎవరు ఓడుతారో అన్నది రాష్ట్రమంతా పెద్ద చర్చనీయాంశంగా ఉంది. ఎన్నికలు ఎప్పుడు వస్తున్నా ఇలాంటి సందేహాలు మామూలే. రాజకీయనాయకులు, రాజకీయ వర్గాల వారే కాక, ప్రత్యేకించి వ్యూహకర్తలు, కొంతమంది జోస్యాలు చెప్పేవాళ్లు, ఫలానా వాళ్లే గెలుస్తారంటూ ముందస్తుగానే సర్వేలు చేశామని ఊకదంపుడు మాటలు చెప్పేవాళ్లు కోకొల్లలు. వీరి మధ్యల్లో అభ్యర్థులు నిత్యం గెలుస్తామా..లేదా?..అనే ఉత్కంఠతో తర్జనభర్జనలు పడుతుంటారు. ఎన్నికల బరిలో ఉన్నవాళ్లు, లేదా ప్రధాన పార్టీల వాళ్లు, వాళ్ల నాయకులు రాష్ట్రంలో ఏమూలకు వెళ్లి సభ పెట్టినా జనం ఆ కొసనుంచి ఈ కొసదాకా పరుగులుపెట్టి మరీ వస్తుంటారు. వాళ్లను చూసి ఈ ఎన్నికల్లో గెలుపు తమదేనని నాయకులు అనుకుంటూ ఉంటారు. ఒకే ఊరిలో ఉదాహరణకు జగన్ వచ్చినా, చంద్రబాబు వచ్చినా, పవన్ వచ్చినా, షర్మిలమ్మ వచ్చినా జనం మాత్రం తండోపతండాలుగా వస్తారు. మిద్దెలు మేడల మీద, చెట్లు చేమల మీదంతా జనమే కనిపిస్తుంటారు. ఆ జనాన్ని చూసి గిట్టని వారు..ఆ జనాన్ని డబ్బులిచ్చి తోలుకొచ్చారని నిష్ఠూరాలాడుతుంటారు. అంతేకాదు, ఆ సభలకు జనానికి బిర్యానీ ఇచ్చారని, మందు సీసాలిచ్చారని కూడా ప్రచారం చేస్తుంటారు. కానీ, సదరు నాయకుడే ఆ ఊరికి వచ్చి సభ పెట్టినా వచ్చేది ఆ జనమే. పార్టీల్లో ఉన్న కార్యకర్తలు అనుకోవాలే కానీ అనేక సందర్భాల్లో వారి కష్టం మీద పార్టీ గట్టెక్కిన సందర్భాలు అనేకం. అయితే, వారి సహకారంతో గెలిచాక ఆ కార్యకర్తల మాటే మరిచిపోయే నాయకులుండబట్టి కార్యకర్తలు కూడా అదే ధోరణిలో ఉండక ఏం చేస్తారు?..అటు తమను నమ్మి ఓట్లేసే ప్రజలను కానీ, తమ వెంటే ఉండి జెండాలు మోసే కార్యకర్తలను కానీ తమ అవసరానికని కాక, వాళ్ల అవసరాలను కూడా ఒకసారికాకుంటే మరోసారైనా చూడగలిగితే వాళ్లు కూడా నమ్మకంగానే ఉంటారు. నాయకులనే వారిపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. ఆ విశ్వసనీయత కోల్పోతే ఎంత గొప్పనాయకుడైనా ఇంటికి పోవాల్సిందేనని గతంలో ఎన్నో సంఘటనలు రుజువు చేశాయి. అయితే, వాస్తవానికి ఏ అభ్యర్థీ తాను ఓడిపోతానని పోటీ చేయడు. గెలవాలనే మనసులో గట్టిగా ఉంటుంది. తన సభలకు వచ్చిన జనాన్ని చూసి గెలుపు గ్యారంటీయే అనిపిస్తుంటుంది కూడా. కానీ, విచిత్రం..ఆ అభ్యర్థి ఓడిపోతుంటాడు. గతంలో పెద్దపెద్ద నేతలు సైతం అలాంటి ఓటమిని చవిచూసిన వాళ్లే.




ఏదేమైనా, ఏ అభ్యర్థీ ఓడిపోయేదాకా తన ఓటమిని ఊహించలేడు. అయినా, ఓడిపోతామని తెలిస్తే నిలబడడమెందుకు?.. మొత్తంగా కథలో నీతి ఏమిటంటే, మొన్నటికి మొన్న కేసీఆర్ జగనన్నకి చెప్పినట్లుగా, ‘ఈ జనంతో కాస్త జాగ్రత్తగా ఉండాలి సుమా’ అన్నదే కరెక్టు. ఎందుకంటే, ఆయనకు ఇది అనుభవైకవేద్యం అయింది కాబట్టి. అంతకుముందు రేవంత్ కాదు కదా.. అసలెవరూ తనను ఓడించలేరని, బంగారు తెలంగాణ తానే తెచ్చాను కనుక జనమంతా తనవెంటే ఉన్నారని ఆయన అనుకున్నారు. కానీ, వాస్తవంలోకి వచ్చే సరికి ఫలితాలు తిరగబడ్డాయి. ఇక్కడొక మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, డబ్బులిచ్చేస్తే గెలిచేస్తామని, మందు సీసాలిచ్చే ఓట్లు గుంపగుత్తగా పడిపోతాయని కొందరు, తాము అధికారంలోకి వస్తే మీకు అది చేస్తాం.. ఇది చేస్తాం.. పథకాలన్నీ మీకే ఇస్తాం.. అంటూ వాగ్దానాలు చేసిపారేస్తే ఓట్లకు కొదవ ఉండదని అనుకునే వాళ్లు మరికొందరు. అలాంటివాళ్లు ఒకవేళ పదవిలోకి వచ్చినా ఆ హామీల సంగతిని మరచిపోతుంటారు. గుర్తుచేసిన వారిని తంతామని బెదిరిస్తుంటారు. నోట్లిస్తే ఓట్లు రాలుతాయని, తాయిలాలిస్తే ఓట్లు పడతాయని, ఎవరిని ఎలా బుట్టలో వేసుకోవాలో తమకు బాగా తెలుసని చాలామంది అనుకుంటూ ఉంటారు. కోట్లు చేతిలో ఉంటే..ఓట్లు అవే వచ్చి పడతాయని అనుకునేవాళ్ళూ లేకపోలేదు. కానీ, అలాంటివన్నీ ఉత్త భ్రమలేనని ఇప్పటిదాకా జరిగిన ఎన్నో ఎన్నికలు రుజువు చేశాయని చెప్పినా వారి చెవికి వినిపించదు. ‘మీదే గెలుపు.. అవతలి వాళ్లకి డిపాజిట్టు కూడా రాదు’ అని పొగిడే భజనపరుల మాటలు మాత్రం వారికి ఇంపుగా ఉంటాయి. వాస్తవాలను ఊహించలేరు.. చెప్పినా భరించలేరు. తీరా ఓడిపోయాక.. ఆ భజనగాళ్ళు అడ్రసుండరు.

ఏదేమైనా.. రానున్న ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో.. ఎవరు ఓడుతారోనని సర్వత్రా చర్చ జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయినా.. ఎవరిని ఎన్నుకోవాలో ప్రజలే నిర్ణయించుకుంటారు. మధ్యలో ఈ గోలంతా ఎందుకంటారా?... ఊరుకుంటే ఊరా పేరా అన్నట్లు.. ఎన్నికలొచ్చేదాకా ఊరకుండలేం కదా!.. అందుకే, ఎవరి ఊహాగానాలు వారివి. అయినా, రోజుకో రంగు మారిపోతున్న నేటి రాజకీయ వాతావరణంలో ఏ గాలెటు కొడుతుందో, ఎవరిని గెలిపిస్తుందో..ఎవరిని ఓడిస్తుందో.. ఎలా చెప్పగలం?.. గెలుపోటములు దైవాధీనాలు. అయితే, ఒక్కటి మాత్రం నిక్కచ్చిగా చెప్పవచ్చు.. ఎవరు నిలిచినా..ఎవరు గెలిచినా.. ఎవరు ఓడినా... అంతిమ విజయం మాత్రం ఓటరుదే!..

- రాజశ్రీ

# ఈ తరం తరించింది!

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం మొత్తం గర్వించిన రోజు 2024, జనవరి 22వ తేదీ. కొన్ని కోట్లమంది కల ఆరోజు సాకారం అయ్యింది. 500 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ, పోరాటం తరువాత రాములోరు తమ సొంతింటికి వచ్చేశారు. ఈ పోరాటం ఎంతమందిదైనా, ఈ ప్రతిభ ఎవరిదైనా, ఈ పుణ్యం ఎవరికి చెందినా ఈ మహత్కార్యక్రమాన్ని దర్శించే భాగ్యం మాత్రం ఈ తరానికి దక్కింది. భారతదేశంతో పాటు ప్రపంచ నలుమూలలా ఉన్న హిందువుల నోట రామనామస్మరణ జరిగింది. ఈ సృష్టి ఏర్పడిన తరువాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, చారిత్రాత్మకంగా, ఆడంబర ఆధ్యాత్మిక సంబరంగా జరిగిన అతిపెద్ద వేడుక అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం, బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం అని నా భావన. ఈ మహిమాన్విత, మహోన్నత కార్యక్రమాన్ని చూసి తరించిన ఈ తరంలో నేనూ పుట్టినందుకు గర్విస్తున్నాను... జై శ్రీరామ్!

టి. ప్రతీక్‌రెడ్డి, కాలిఫోర్నియా, యుఎస్ఏ.

# తనిఖీలు సాఫీగా సాగాలి!

ఎన్నికల సంఘం ఈసారి కొంచెం ముందే మేల్కొంది. 2024లో జరగవలసి ఉన్న సార్వత్రిక ఎన్నికలలో డబ్బు పంపకాన్ని, మద్యం ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఇప్పటినుండే కసరత్తు మొదలుపెట్టింది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తనిఖీలు చేపట్టవలసిందిగా పోలీసుశాఖని, భారీ ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని అందించవలసిందిగా బ్యాంకులను ఆదేశించింది. మన రాష్ట్రంలో కూడా పోలీసు శాఖ అప్పుడే రంగంలో దిగి సరిహద్దుల్లో సోదాలు మొదలుపెట్టింది. ఎన్నికలు ఇంకా మూడు నెలలు ఉన్న తరుణంలో ఈ పోలీసు తనిఖీలు ప్రజలకి ఇబ్బందికరమైనవే. అయినా తప్పదు, వాళ్ళ విధులు వాళ్ళు నిర్వహించాల్సిందే కదా. కాకపోతే వచ్చే నెలలో కొన్ని వేల పెళ్లిళ్లు ఉన్నాయి. ఇంట్లో జరిగే శుభకార్యం కోసం షాపింగులకు వెళ్ళేవాళ్ళని, కార్యక్రమానికి హాజరు కావడం కోసం పిల్లాపాపలతో, ఆభరణాలతో వెళ్ళే మహిళలని గమనించి, గుర్తించి వారికి సడలింపు కల్పిస్తే బాగుంటుంది. పోలీసుశాఖ వారు తమకున్న విచక్షణాధికారాలతో అహంభావంతో ప్రవర్తించకుండా, ఈ తనిఖీలు కూడా స్నేహపూరిత వాతావరణంలో నిర్వహిస్తే ప్రజలు హర్షిస్తారు. పోలీసుశాఖ పెద్దలు, ఎన్నికల సంఘం అధికారులు ఆ విధంగా ఆదేశాలు ఇస్తే బాగుంటుంది!

జీ.వీ. సుబ్బయ్య, పిడుగురాళ్ల.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# మహిళలను బురిడీ కొట్టిస్తున్న.. గొలుసు దొంగలు

## బైక్‌ల మీద వస్తున్నారు...నగలు తెంపుకుపోతున్నారు



నెల్లూరు నగరంలో గొలుసు దొంగలు మహిళలను అత్యంత సునాయాసంగా బురిడీకొట్టించేస్తూ, వారి మెడలో ఉన్న బంగారుదండలను లాక్కొనిపోతున్నారు. వారితో మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఉన్నట్లుండి నగలు లాగేసుకుని పారిపోతున్నారు. మొన్నమొన్నటిదాకా ఆ దుండగులు మోటార్‌బైక్‌ల మీద వేగంగా వచ్చి.. ఆ దారిన పోతున్న మహిళల మెడల్లో బంగారు ఆభరణాలు లాక్కుని ముఖం కూడా కనపించకుండా జాగ్రత్తపడుతూ పారిపోయేవారు. ఇప్పుడు ఏకంగా మహిళలతో మాట్లాడుతూనే నగలు లాగేసుకుంటున్నారంటే ఎంత బరితెగించారో చూడండి. ఈ గుండెలు తీసిన బంట్లు నగరంలో జాస్తియిపో యారు. ఇటీవల నెల్లూరులోని బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటివి రెండు కేసులు నమోదయ్యాయి. బాలాజీనగర్ శివారుల్లోని సరస్వతి నగర్‌లో రమణమ్మ అనే మహిళ ఇంటిముందు నిలబడి ఉంటే, ఇద్దరు అగంతకులు నేరుగా ఆమె వద్దకు వచ్చి తమకేదో అడ్రసు కావాలని అడిగారు. పాపం..ఆమె నమ్మి, వారితో మాట్లాడుతుండగానే ఆ దుండగులు హటాత్తుగా ఆమె మెడలో బంగారు దండను పెరుక్కుని పారిపోయారు. ఈ హఠాత్సంఘటనకు ఆమె బిత్తరపోయింది. ఏమైందో తెలుసుకునేలోగానే ఆ దోపిడిగాళ్ళు బైక్‌పై పారిపోయారు. అదేవిధంగా అదేరోజు రాత్రి ఎన్టీఆర్‌నగర్‌లో ఓ చిల్లర అంగడి పెట్టుకుని ఉన్న సరోజనమ్మ అనే మహిళ వద్దకు వచ్చిన దుండగులు ఓ నీళ్ళబాటిల్ తీసుకుని ఆమెకు డబ్బులు ఇస్తున్నట్లు నటిస్తూ, గబుక్కున ఆమె మెడలోని 3 సవర్ల బంగారుదండను తెంపుకుని పారిపోయారు. మోటార్‌బైక్‌ల మీద వచ్చి..మహిళలకు మస్కాకొట్టి పోతున్న అలాంటి దొంగల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. వీధుల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేసుకుంటే ఇలాంటి దుండగులను సులువుగా గుర్తించవచ్చు. పోలీసులు ప్రత్యేక నిఘా బృందాలను రంగంలోకి దించి ఈ దుండగుల ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

# సాయికృష్ణ యాచేంద్రను పరామర్శించిన వేమిరెడ్డి



ఎస్వీబీసీ ఛైర్మెన్.. వెంకటగిరి రాజా సాయికృష్ణ యాచేంద్ర ఇటీవల కొంత అస్వస్తతకు గురైన నేపథ్యంలో, ఆ సమాచారాన్ని తెలుసుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వెంకటగిరికి వెళ్ళి ఆత్మీయంగా ఆయనను కలుసుకుని పరామర్శించారు. సాయికృష్ణ యాచేంద్ర యోగక్షేమాలను, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. యాచేంద్ర ఆరోగ్యంగా ఉండాలని, ఆ భగవంతుడి దీవెనలు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. అనంతరం వెంకటగిరి కోట అంతా కలియ దిరిగారు. పార్టీ జిల్లా కోశాధికారి కాటంరెడ్డి రవీంద్ర రెడ్డి, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.


# హనుమంతుని ఆలయంలో.. రామభజనలు

జనవరి 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ రోడ్డులో ఉన్న హనుమంతుని ఆలయంలో వినయ, లక్ష్మీ భవాని, శ్రీవత్స, వారి శిష్యబృందం రామ భజనలు, కీర్తనలు ఆలపించారు. గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం, గాయనీ గాయకులకు ఆమె సన్మానం చేశారు.



## ఆధ్యాత్మిక-సామాజిక సేవా వికాసాలే లక్ష్యంగా..

# నెల్లూరుకి రానున్న.. 'రామకృష్ణ మిషన్'



### ○ మరింత విస్తృతం కానున్న స్వామి వివేకానంద బోధనలు



***ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన..శ్రీ స్వామి వివేకానంద స్థాపించిన అంతర్జాతీయ సేవాసంస్థ 'రామకృష్ణ మిషన్'తో ఏళ్ళతరబడిగా ఉన్న నెల్లూరీయుల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా..త్వరలోనే నెల్లూరు నగరంలో తొలిసారిగా రామకృష్ణ మిషన్ తన శాఖను ఇక్కడ ప్రారంభించబోతోంది. ప్రపంచఖ్యాతిగాంచిన మహా వక్త, నవభారత ప్రవక్త స్వామి వివేకానంద స్ఫూర్తితో దేశ విదేశాల్లో రామకృష్ణ మఠం, మిషన్ కేంద్రాలు సుమారు 3 వందల వరకు ఉన్నాయి. దాదాపు నూటపాతికేళ్లుగా ఈ కేంద్రాలు మానవాళికి నిరుపమానమైన సేవలందిస్తూనే ఉన్నాయి. అందులో నెల్లూరు కూడా ఒకటి కానుండడం ఎంతైనా విశేషం. సింహపురి సీమకే గర్వకారణం.***

నెల్లూరులో రామకృష్ణ మిషన్ శాఖ త్వరలోనే ప్రారంభం కానుంది. అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. స్వామి వివేకానందను అభిమానించి ఆరాధించే వారికి, సేవాభావంతో సమాజానికి తమవంతు సేవలందిస్తున్న యువతకి ఇదెంతో ఆనందం కలిగించే విషయం. ఆధ్మాత్మిక, సామాజిక సేవారంగాల్లో రామకృష్ణ సేవాసంస్థల పాత్ర అద్వితీయమన్నది అందరికీ తెలిసిందే. దాదాపు 125 సంవత్సరాల క్రితం స్వామి వివేకానంద సమాజాభ్యున్నతి కోసం రామకృష్ణ మఠాన్ని ప్రారంభించారు. అది అచిరకాలంలోనే సుప్రసిద్ధమై, ప్రపంచవ్యాప్త ఖ్యాతిగాంచింది. ఈ అపురూప సేవాసంస్థల కార్యకలాపాల్లో తాజాగా నెల్లూరుసీమ కూడా తనవంతుగా మరింత గొప్ప పాత్రను పోషించే అవకాశం రావడం సంతోషకరమైన విషయం.

### 1968లోనే నెల్లూరులో 'శ్రీ రామకృష్ణ సేవాసమాజం':

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని 1968లో నెల్లూరులో పూజ్యశ్రీ నందానందజీ మహరాజ్ సమక్షంలో శ్రీ రామకృష్ణ సేవా సమాజం ఆవిర్భవించింది. నగరంలో ప్రముఖులైన డాక్టర్ సీపీ శాస్త్రి ఈ సమాజానికి స్థాపక అధ్యక్షులుగా, ఎస్‌వి నరసింహారావు (శారదాకుమార్) కార్యదర్శిగా ఉంటూ స్వామి వివేకానందుని బోధలను యువతకు ప్రబోధించేవారు. 1973లో ఆ సంస్థను రిజిస్టరు చేశారు. జెఎస్ఆర్ (జమ్మలమడక శ్రీరామచంద్రమూర్తి), దేవతు రాఘవయ్య, బొమ్మిశెట్టి యలమందయ్య తదితర ప్రముఖులు తొలినాళ్ళ కార్యవర్గంలో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత కాలక్రమంలో 1992లో ఆ సమాజాన్ని 'శ్రీ రామకృష్ణ సేవా సమితి'గా మార్చి రిజిస్టరు చేశారు. తొలి దశలో ఈ సమాజ కార్యక్రమాలన్నీ నెల్లూరు పొగతోటలోని కాసుఖేల వారి అగ్రహారంలో ఒక పాత భవంతిలోనే జరిగేవి. సనాతన ధర్మపరాయణులైన కాసుఖేల రఘురామయ్య, పార్ధివేశ్వర రావు, సుబ్బారావులు నగరం నడిబొడ్డున ఎంతో విలువైన ఆ స్థలాన్ని రామకృష్ణ సేవాసమితికి ఉదారహృదయంతో వితరణగా ఇవ్వడం విశేషం, బోడ చిదంబరం అధ్యక్షులుగా ఉన్న సమయంలో ఆ తర్వాత భక్తులు, దాతల సహకారంతో అక్కడ భవన నిర్మాణం కూడా జరిగింది.

### సరస్వతీదేవి నిలయంగా...

2000వ సంవత్సరంలో విశాఖపట్నం రామకృష్ణ మిషన్ కార్యదర్శి పూజ్యశ్రీ అమృతానందజీ మహరాజ్ ఇక్కడ శ్రీ రామకృష్ణుల వారి అర్చామూర్తిని ప్రతిష్టించగా, స్వామి పరమార్ధానందజీ మహరాజ్ శ్రీ వేంకటేశ్వర గ్రంథాలయం, పఠనాలయాన్ని ప్రారంభించి ఆ భవనాన్ని సరస్వతీదేవి నిలయంగా రూపుదిద్దారు. అప్పట్లో ఏడాది పొడవునా 52 ఆదివారాల్లో వాల్మీకి రామాయణంపై ఆచార్య పోలూరి హనుమజ్జానకీరామశర్మ ఆధ్యాత్మికోపన్యాసాలు,ఆయన రచించిన 'శ్రీ రామాయణ తరంగిణి' గ్రంథాన్ని ఏడు సంపుటాలుగా ప్రచురించడం వంటి ఆధ్యాత్మిక సేవలు నిర్వహించారు. ఇలా పలువురు ప్రసిద్ధులైన ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖ స్వామీజీల ప్రసంగాలతో శ్రీ రామకృష్ణ సేవాసమితి నెల్లూరు ప్రజలకు మరింత చేరువైంది. ఆ తర్వాత 1985 నుండి మాతృశ్రీ శారదాదేవి జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా వందలాదిమంది పేదలకు అన్నసంతర్పణ కూడా జరుగుతుండేది. మానవసేవ, మాధవసేవ జమిలిగా నిర్వహిస్తూ రామకృష్ణ సేవా సమితి సేవలు అందరి అభినందనలు అందుకుంటున్నాయి. డాక్టర్ మోహన్‌రాజు అధ్యక్షులయ్యాక నెల్లూరు నవలాకులతోటలోని శ్రీ రామకృష్ణ ఆశ్రమ ప్రాంగణంలో పేదలకు ఉచిత ఆరోగ్యసేవా శిబిరాలను ముమ్మరంగా నిర్వహించడం జరిగింది.



### బహుముఖ సేవలందిస్తున్న.. 'శ్రీ రామకృష్ణ సేవాశ్రమం'

పూజ్యశ్రీ పూర్ణానంద స్వాములవారు 1982లో నెల్లూరు నగరంలోని నవలాకుల తోటలో 3వ మైలు వద్ద శ్రీ రామకృష్ణ సేవాశ్రమం స్థాపించారు. శ్రీరామకృష్ణ వివేకానంద భావప్రచార పరిషత్, ఆంధ్రప్రదేశ్ అనుబంధ సంస్థగా ఈ ఆశ్రమం పురోభివృద్ధి సాధించింది. ప్రముఖ స్వామీజీల ఆధ్వర్యంలో సాధన సమావేశాలు, సాప్తాహిక సత్సంగాలు, డాక్టర్ ప్రసన్న గుప్తా ఆధ్వర్యంలో ప్రతి రెండవ ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరాలు జరుగుతున్నాయి. ఫలితంగా గత కొంతకాలంగా జిల్లావ్యాప్తంగా శ్రీ రామకృష్ణుని బోధనలు, స్వామి వివేకానంద ఆదర్శాలు యువతను, ప్రజలను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఎందరో మహానుభావులు ఈ ఉద్యమ వ్యాప్తికి, సనాతన ధర్మ ప్రచారానికి తమవంతు చేయూతనందిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో శ్రీ రామకృష్ణ సేవాశ్రమం రామకృష్ణ మిషన్‌లో విలీనమై తన కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు మార్గం సుగమమైంది. అందుకు డాక్టర్ మోహన్‌రాజు దాదాపు తొమ్మిదేళ్ల పాటు కలకత్తాలోని ఆ సంస్థలకు చెందిన స్వామీజీలతో సంప్రదింపులు జరపడం, ఎట్టకేలకు వారు సమ్మతించడం జరిగాయి. ఈ సేవాశ్రమానికి నిర్వాహకులు టి.లక్ష్మీనారాయణరావు, కె.ఎస్ నరసయ్య, వి.సాయి రవి, ఎం.మల్లికార్జునరావు, ఎం.మాల్యాద్రి, పి.మురళి, పి.నాగిరెడ్డి, జి.జయచంద్ర తదితరులు నేటికీ తమవంతు సేవలందిస్తున్నారు. దాతలు చేయూతనందిస్తే ఈ సేవా సంస్థ త్వరలోనే సుస్థిరమై సమాజంలో ఆధ్యాత్మిక, సామాజిక వికాసానికి మరింతగా తోడ్పడేందుకు కృషి చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# నెల్లూరు కబుర్లు

### కనుపర్తిపాడు.. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
## దివ్య చరిత్ర ఆవిష్కరణ



నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు గ్రామంలో ఎంతోకాలంగా భక్తుల పూజలందుకుంటున్న శ్రీ నాగేంద్ర సహిత వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి సన్నిధికి సంబంధించిన చరిత్రను, ఆలయ విశేషాలను ప్రముఖ రచయిత దంపూరు రామకృష్ణ పరిశోధించి రూపొందించిన పుస్తకాన్ని ఈనెల 22న రాజ్యసభ సభ్యులు, ఆధ్యాత్మిక సామాజిక సేవా పరాయణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో ఆవిష్కరించారు. విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ పెంచలరెడ్డి, విశ్రాంత ఏఓ ఏలూరు శ్రీనివాసులు, విశ్రాంత తహశీల్దార్ ధూర్జటి సుధాకర్, ఈతకోట సుబ్బారావు, పొన్నగంటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో..
## అఖండ దీపారాధన



జనవరి 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో రామనామ స్మరణతో అఖండదీపాలు వెలిగించారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరాం, కార్యనిర్వాహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ప్రధాన అర్చకుడు రఘురాం శర్మ, సభ్యులు దొరబాబు, మల్లు రామ్మోహన్‌రెడ్డి, మాలేపాటి పద్మజ, భారతి తదితరులు పాల్గొన్నారు.

## 'మట్టిబండి' పరిచయ వేదిక 28న

ప్రముఖ కవి డా.నాగభైరవ ఆదినారాయణ రచించిన 'మట్టిబండి' దీర్ఘకవిత పరిచయవేదిక జనవరి 28న నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్ రూమ్‌లో జరుగుతుందని పెన్నా రచయితల సంఘం (పెరసం) అధ్యక్ష కార్యదర్శులు అవ్వారు శ్రీధరబాబు, తోట సులోచన, కార్యనిర్వాహక కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి చిన్ని నారాయణరావు అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ నవలా రచయిత్రి డా. పెళ్లకూరు జయప్రద, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కుమార్‌రాజా, సారస్వతవేత్తలు మెట్టు రామచంద్రప్రసాద్, ఎన్ఆర్ తపస్వి, డా. బీరం సుందరరావు పాల్గొంటారని, డా. గంగిశెట్టి శివకుమార్ ఆ దీర్ఘకవితను సమీక్షిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు కవి సమ్మేళనం, కవులకు సత్కారాలు ఉంటాయని పేర్కొన్నారు.









## ప్రమాదాలను నివారించాలి
### రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో జేసీ

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపే వాహనదారులపై తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 20న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏ వ్యక్తి అయినా ప్రమాదంలో మరణించినప్పుడు వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, అందువల్ల వాహనాలను నడిపే టప్పుడు తగిన జాగ్రత్తలను పాటిస్తూ తమ ప్రాణాలకు ప్రమాదం సంభవించకుండా చూసుకోవాలని ఆయన ప్రజలనుద్దేశించి అన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడం ప్రమాదకరమని, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, వాహనదారులకు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని తెలిపారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతీయ భద్రత అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని, విధి నిర్వహణలో అలక్ష్యం వహించరాదని హెచ్చరించారు. జనవరి 20 నుండి ఫిబ్రవరి 19 వరకు నెలరోజులపాటు ప్రజల్లో, విద్యార్థుల్లో రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు రహదారి భద్రత శాఖ చర్యలు చేపడుతుందన్నారు.

### డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం - డిటిసి చందర్

జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ చందర్ మాట్లాడుతూ, ఈ నెలరోజులు లారీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు వాహనాలను నడపడంలో అవగాహన పెంపొందిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించడంతోపాటు, వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో వాహన ప్రమాదాలు జరగ కుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా కరపత్రాలను, పోస్టర్లను, బ్యానర్లను జాయింట్ కలెక్టర్, అధికారులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి. ఏవిఆర్పీబి ప్రసాద్, డిఎస్పీ అబ్దుల్ సుభాన్, సిటీ ప్లానింగ్ అధికారి దేవికుమారి, ఇన్చార్జ్ ఆర్టిఓ మురళి, ఆర్టీసి ఆర్ఎం శేషయ్య, డిఐఓసి సురేష్‌బాబు, ఎన్‌హెచ్ఏఐ అధికారి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో ఆటోలు నడపాలి



ఆటో డ్రైవర్లు క్రమశిక్షణ లేకుండా వాహనాలను ఇష్టం వచ్చిన విధంగా రహదారులపై నిర్దిష్ట పార్కింగ్ లేకున్నప్పటికీ నిలుపుతుండడం మంచిపద్ధతి కాదని, క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ అవసరమని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రాంతీయ రవాణా అధికారి కొర్రపాటి మురళీమోహన్ చెప్పారు. ఇటీవల జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా ఆయన నెల్లూరు-గొలగమూడి రోడ్డు వద్ద వాహన సామర్థ్య పరీక్ష ధృవీకరణ కేంద్రంలో వాహన డ్రైవర్లకు, వాటి యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిమితికి మించి ప్రయాణికుల్ని ఆటోల్లో తీసుకువెళ్లడం కూడా రహదారి భద్రత దృష్ట్యా సరైనది కాదని అన్నారు. మోటార్ వాహనాల తనిఖీ అధికారి బాలమురళీకృష్ణ, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు పూర్ణచంద్రరావు, కార్తీక్ పవన్‌కుమార్, స్వప్నిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యకు ఆదివాసీల సైకిల్ యాత్ర
### - దిగ్విజయం కావాలని ఆకాంక్షించిన విపిఆర్



నెల్లూరు వైకాపా ఎంపీ అభ్యర్థి, జిల్లా పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఇటీవల అయోధ్యకు వెళ్తున్న ఆదివాసీల సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. శ్రీశైలం నుంచి కన్యాకుమారి వరకు వారు చేపట్టిన సైకిల్ యాత్ర నెల్లూరుకి చేరుకున్న సందర్భంగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో సైకిల్ యాత్రికులు కలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా యాత్రను చేపట్టాలని విపిఆర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. యాత్ర దిగ్విజయంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి ఆర్థిక సహాయం చేశారు. చిన్నారులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు.

### ఏపీ ఫిల్మ్ ఛాంబర్..
## జిల్లా కో-ఆర్డినేటర్‌గా 'కళాంజలి' అనంత్



'కళాంజలి' సాహిత్య సాంస్కృతిక వేదిక ద్వారా నెల్లూరులో ఎన్నో సాహిత్య కార్యక్రమాలు, కళాప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకుంటున్న కళాంజలి అనంత్ ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్‌గా ఎంపికయ్యారు. ఇటీవల ప్రముఖ సినీ నిర్మాత..గీత రచయిత.. మన నెల్లూరీయుడైన ఏఎం రత్నం ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా ఎన్నికైన నేపథ్యంలో నెల్లూరు టౌన్‌హాల్‌లో ఆయన్ను జిల్లా కళాకారులు, కళాభిమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఛాంబర్ తరపున కళాంజలి అనంత్‌ను జిల్లా కోఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఛాంబర్ కార్యదర్శి జెవి మోహన్ గౌడ్ మాట్లాడుతూ, తెలుగు చిత్రపరిశ్రమలో నెల్లూరుజిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ జిల్లా నుంచి మహాగాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఇంకా అనేకమంది కళాకారులు సినీ పరిశ్రమలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారని అంటూ, ఏఎం రత్నం ప్రముఖ నిర్మాత, రచయితగా పేరొందడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. రాష్ట్రంలో చిత్రపరిశ్రమ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ ఎఫ్‌డిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏ.ఎం.రత్నంను ఘనంగా సన్మానించారు. ఛాంబర్ కోశాధికారి ఎం.శ్రీనాథరావు, ఉపాధ్యక్షులు మంతా శ్రీనివాస్, సహాయ కార్యదర్శి పి.రమణారెడ్డి, కార్యవర్గసభ్యులు పిడిఆర్ ప్రసాదరెడ్డి, మిత్తన ఈశ్వరరావు, మాజీ ఇసి సభ్యులు డి.ప్రభాకర్‌రావు, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ బి.పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు గాయనీ గాయకులతో సినీ సంగీత విభావరి జరిగింది. 'పాడుతాతీయగా' గాయని జ్ఞానశ్రీ, సురభి సంగీత్ సౌరభ్, అభినవ ఘంటసాల కృష్ణయ్య, పార్వతీశం అద్భుతంగా ఆలపించిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## అయ్యప్పస్వామి ప్రతిష్ఠా దినోత్సవం



నెల్లూరు వేదాయపాళెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈనెల 21న స్వామివారి 38వ వార్షిక ప్రతిష్ఠా దినోత్సవం ఘనంగా జరిగింది. కేరళ సంప్రదాయ పద్ధతుల్లో, మకర మాస రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకొని వేడుకలు చేశారు. ఆలయంలో మహాగణపతి హోమం, విశేష నవకలశ పూర్ణాభిషేకం, పుష్పాభిషేకం, అర్చన, మహా హారతి నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మురళీమోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, అక్కెం మల్లికార్జునరెడ్డి చంద్రప్రభ తదితరులు పాల్గొన్నారు.



# దేశ ప్రజల కల.. సాకారం

## ➢ 'దీపమ్మ' సంతోషం

ఎట్టకేలకు అయోధ్యలో రామాలయం నిర్మించాలనుకున్న దేశ ప్రజల కల సాకారమైందని, జనవరి 22వ తేదీన అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ట జరగడాన్ని దేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారని వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ, భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు కుమార్తె దీపా వెంకట్ (దీపమ్మ) అన్నారు. అయోధ్యలో రామాలయాన్ని అత్యద్భుతంగా నిర్మించడం సంతోషదాయకమన్నారు. జనవరి 22న నెల్లూరు నగరంలో పెద్దఎత్తున ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం, స్థానిక శివాజీ సెంటర్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలరాముని ప్రతిష్ఠోత్సవాన్ని నగర ప్రజలు చూసేందుకు ఎల్ఈడీలను ఏర్పాటు చేయడం పట్ల ఆమె హర్షం ప్రకటించారు. దాదాపు 500 సంవత్సరాల నుండి కలగా మిగిలిపోయిన అయోధ్య రామమందిరం కళ్ళముందు సాకారం కావడం ఒక అద్భుతమన్నారు. బాలరాముని విగ్రహ ప్రతిష్టతో జనవరి 22..చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేరోజుగా ప్రసిద్ధమవుతుందన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, బిజెపి నాయకులు వాకాటి నారాయణరెడ్డి, సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర నాయకులు నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి బయ్యా వాసు, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు పిట్టి సత్యనాగేశ్వరరావు, కార్పొరేటర్ వేలూరు మహేష్, బిజెపి జిల్లా అధ్యక్షులు శీపా వంశీధర్‌రెడ్డి, వీహెచ్‌పి నాయకులు ఏవిఆర్ మోహన్‌రావు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఆడిటర్ సీవీ సుబ్రహ్మణ్యం, శ్రీకంఠం రమణయ్య పాల్గొని అయోధ్యలో జరిగే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడి మెగా స్క్రీన్ ద్వారా వీక్షించారు. శ్రీరామ మందిర ఉత్సవాల పర్యవేక్షణ కమిటీ నెల్లూరుశాఖ అధ్యక్షులు మోదెం మల్లికార్జునరావు, బిఎస్ రంగరాజన్, పేటేటి భాస్కర్, హర్షవర్ధన్, శ్రీధర్, రాధాకృష్ణమూర్తి తదితరులు పర్యవేక్షించారు. పి.సురేంద్రరెడ్డి. బిఎస్ రంగరాజన్, కందికట్ల రాజేశ్వరి, కరణం సుభాషిణి, పైడిమాని సృజన, విజయరాణి, ప్రసన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నారికేళ సహిత రసలింగేశ్వరునికి.. వైభవంగా రుద్రాభిషేకం

- జగన్ మళ్ళీ సీఎం కావాలంటూ..భారీఎత్తున పూజలు
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఆధ్వర్యంలో..ఆదిదంపతుల కల్యాణం
- నార్త్ రాజుపాళెంకు వేలసంఖ్యలో తరలివచ్చిన అభిమాన జనం





**రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ పీఠాన్ని అధిష్టించాలని ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరులను ప్రార్థిస్తూ కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈనెల 20న ఎంతో భక్తిశ్రద్ధలతో అత్యద్భుతమైన రీతిలో నారికేళ సహిత రసలింగేశ్వర(పాదరస) స్వామి రుద్రాభిషేకం, ఆదిదంపతుల కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. కొడవలూరు మండలంలోని నార్త్‌రాజుపాళెం గ్రామం అందుకు వేదికైంది. జిల్లా నలుమూలల నుంచి ప్రముఖులు, వేలసంఖ్యలో ప్రజలు ఈ పూజలకు తరలివచ్చి జగన్ పట్ల, ప్రసన్న పట్ల ఉన్న తమ అభిమానాన్ని చాటుకున్నారు.**

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి, రాష్ట్రాభ్యుదయానికి అవిరామంగా శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో అఖండ విజయం సాధించి మళ్ళీ సీఎంగా రావాలని కోరుకుంటూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో అత్యద్భుతంగా చేపట్టిన శ్రీ నారికేళ సహిత రసలింగేశ్వర రుద్రాభిషేకం, వేదపండితుల వేద మంత్రాల మధ్య, మంగళవాద్యాల మధ్య పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా.. నయనానందకరంగా సాగి అందరినీ భక్తిభావసమన్వితులను చేశాయి. 'ఓం నమ:శివాయ' అంటూ శివపంచాక్షరి నామం యాగప్రాంగణమంతా మార్మోగింది. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు, స్వామివారికి లక్ష రుద్రాక్ష అర్చనలు, లక్ష బిల్వార్చనలు అత్యంత వైభవంగా నిర్వహించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి నారాయణస్వామితో పాటు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు..వైకాపా జిల్లా అధ్యక్షులు..సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టీటీడీ ఉత్తర భారతదేశ ఆలయాల స్థానిక సలహా మండలి (న్యూఢిల్లీ) అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, వీరి చలపతి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, నిరంజన్‌బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పని ముఖ్యమంత్రి.. వైఎస్ జగన్

## ➢ కొనియాడిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఎలాంటి హామీలిచ్చినా వాటిని ఇట్టే నెరవేరుస్తున్నారని, అందుకే మాట తప్పని-మడమ తిప్పని ముఖ్యమంత్రిగా ప్రజల ఆదరణ పొందుతున్నారని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న ఆయన వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని సహాయక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం మాట ఇచ్చిన విధంగానే సుమారు రూ. 78.98 లక్షలను స్వయం సహాయక సంఘాలలోని అక్క




చెల్లెమ్మల ఖాతాలో జమ చేశారన్నారు. సీఎం జగన్ 'చెప్పాడు అంటే చేసేసినట్లే' నంటూ ఆయన ప్రజల హర్షధ్వానాలమధ్య అన్నారు. అనంతరం, 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా పొదుపు సంఘాలకు చెక్కును అందజేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పొదుపు మహిళలతో కలసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పొదుపు సంఘాల వారు పాల్గొన్నారు.

# రామ్-మురళి ఆత్మీయ భేటి

గూడూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను వెంకటగిరి వైకాపా సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈనెల 20న ఆత్మీయంగా కలుసుకుని ముచ్చటించారు. ఈ సందర్భంగా రామ్‌ను మురళి సాదరంగా స్వాగతించారు. గూడూరు నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరిని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి గుర్తుపెట్టుకుని వారికి ప్రత్యేక గుర్తింపు కల్పిస్తారన్నారు. అందుకు నిదర్శనంగా మన మేరిగ మురళి గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ చేయనున్న మేరిగ మురళికి అఖండ విజయం చేకూర్చాలన్నారు. గూడూరు నియోజవర్గంలోని నాయకులందరూ అందుకు కష్టించి పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి మురళి, తాము ఉన్నామన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి నియోజకవర్గానికి



తాను పోటీ చేస్తున్నామన్నారు. తమను గెలిపించి మీకు సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పుట్టిన గడ్డపై.. ఏఎం రత్నంకు సన్మానం



ప్రముఖ నిర్మాత, దర్శకుడు.. ఆంధ్ర ఫిలిమ్ చాంబర్ అధ్యక్షులు ఏఎం రత్నంను ఆయన పుట్టినగడ్డ బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల ఆయన స్నేహితులు, చిన్ననాటి మిత్రులు తాళ్ళ నరసింహస్వామి తదితరుల చేతులమీదుగా ఆత్మీయంగా సన్మానించారు. తాను సినిమా రంగంలోకి వెళ్ళి స్థిరపడినా స్వస్థలమైన బుచ్చిని ఆయన ఏనాడూ మరచిపోలేదు. అందుకే, ఏఎం రత్నంను వారంతా సత్కరించి అభినందించారు. బుచ్చి నగరపంచాయతీ కౌన్సిలర్ జూగుంట కల్యాణ్, సాయి, మల్లికార్జున, ఎర్రా ధనుంజయ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉలవపాడు హైస్కూల్‌ను పరిశీలించిన అడిషనల్ డైరెక్టర్

రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం అడిషనల్ డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి ఈనెల 23న ఉలవపాడులోని హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారు ఎలా చదువుకుంటున్నదీ అడిగి తెలుసుకున్నారు. కేశవరపు జాలిరెడ్డి, కరెస్పాండెంట్ వెంకటశేషమ్మ, ప్రిన్సిపాల్ మౌనిక పాల్గొన్నారు.





# నేతాజీ పోరాటస్ఫూర్తి మార్గదర్శకం

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ దేశభక్తి, ఆ మహనీయుని పోరాటస్ఫూర్తి అందరికీ మార్గదర్శకమని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి విజయకుమార్‌రెడ్డి అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నేతాజీ నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్‌ఆర్ విక్రమ్ కుమార్, డాక్టర్ శ్రీహరిరెడ్డి, అక్బర్‌హుస్సేన్, డాక్టర్ వై అశోక్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఆదిశంకరలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు



వాహనాలు నడిపే డ్రైవర్లు ప్రతి మూడు నెలలకోసారి తప్పనిసరిగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించుకోవాలని గూడూరు రోడ్డు రవాణా శాఖ అధికారి జి.ఆది నారాయణ సూచించారు. గూడూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బస్సు డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో ప్రయాణించే సమయంలో విద్యార్థులు కిటికీలలో తల, చేతులు పెట్టకూడదన్నారు. డ్రైవర్లు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది తప్పనిసరిగా హెల్త్, అడ్రస్‌కు సంబంధించిన కార్డులు వారి వద్దనే ఉంచుకోవాలన్నారు. వాహనాలను అపరిమిత వేగంతో నడపకూడదన్నారు. ఆదిశంకర కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.మోహన్, ప్రిన్సిపల్స్, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో

# శ్రీరామ నామ జపం

500 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా కోట్లాది మంది హిందువుల కల సాకారమైన వేళ... రామ జన్మభూమి అయోధ్యలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా ఈ నెల 22న గూడూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్ గూడూరు వారి ఆధ్వర్యంలో లక్ష తులసి అర్చన, వేద పారాయణం, గోవింద నామాల పారాయణం, శ్రీరామ నామ జపంతో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దాతలుగా శ్రీకంటి రామ్మోహన్‌రావు, పూర్ణ చంద్రరావు, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, కృష్ణంరాజు, రామసుబ్బారెడ్డి, జీవీఎస్ స్కూల్ కరస్పాండెంట్ పవన్ సహకరించారు. విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షులు మురళీరెడ్డి, కార్యదర్శి సి.రమణయ్య, రవిచంద్ర, ప్రసాద్‌రెడ్డి, రామ సుబ్బారెడ్డి, సనత్‌రెడ్డి, రామయ్య, రామ్మూర్తి, రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## దిగువ వీరారెడ్డిపల్లిలో

# అటకెక్కిన పారిశుద్ధ్యం



గూడూరులోని దిగువ వీరారెడ్డిపల్లిలో పారిశుద్ధ్యం అటకెక్కింది. కాలువలలో పూడిక తీయకపోవడంతో చెత్త పేరుకుపోయి విపరీతమైన దుర్వాసన వస్తోంది. వీటి మూలంగా స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సచివాలయ సిబ్బంది కానీ, గూడూరు పురపాలక సిబ్బంది కానీ పట్టించుకోకపోవడంతో స్థానికులే వారి వారి పరిసర ప్రాంతాలను శుభ్రపరచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు తమ ప్రాంతంవైపు చూసి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని వీరారెడ్డిపల్లి వాసులు కోరుతున్నారు.

# ఏబీవీపీ తిరంగా ర్యాలీ

ఏబీవీపీ సేవా భారతి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా గూడూరు పురవీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గూడూరు రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అమలుపరిచిన దినోత్సవాన్ని గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటామని, జాతి సమైక్యతను కాపాడేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరం అన్నారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ నుండి టవర్ క్లాక్ కూడలి, రాజావీధి, కుమ్మరివీధి, మార్కెట్ మీదుగా 75 అడుగుల జాతీయ జెండా తిరంగా ర్యాలీ సాగింది. ఆదిశంకర పాఠశాల ప్రిన్సిపల్ రూపవతి, నారాయణ అకడమిక్ డీన్ నిఖిత, ఆర్ఎస్ఎస్ జిల్లా కళాశాల విద్యార్థి ప్రముఖు మల్లికార్జున, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు చిన్న శివశంకర్ విద్యార్థులు పాల్గొన్నారు.




# శ్రీసిటీపై వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశంసల వర్షం

## దేశ ఆర్థికాభివృద్ధిలో శ్రీసిటీ పాత్రపై హర్షం!



అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల కేంద్రంగా శ్రీసిటీ ప్రఖ్యాతిగాంచి, దేశ ఆర్థికపురోగతికి దోహదపడడాన్ని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రశంసించారు. రాజ్యసభ సభ్యుడి హోదాలో తొలిసారిగా ఆయన తన సతీమణి, తిరుపతి తిరుమల దేవస్థానాల ఉత్తరభారతదేశ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు ప్రశాంతిరెడ్డితో కలసి శ్రీసిటీని జనవరి 24వ తేదీ బుధవారం సందర్శించారు.

సామాజిక బాధ్యత మరియు ఆర్థిక అభ్యున్నతి పట్ల శ్రీసిటీ నిర్వాహకుల నిబద్ధతను ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి కొనియాడారు. తడ, సూళ్లూరుపేట, సత్యవేడు పరిసర ప్రాంతాల అభివృద్ధిని చూస్తుంటే సమాజం పట్ల నైతిక బాధ్యత కలిగిన శ్రీసిటీ నిర్వాహకుల దూరదృష్టికి, వారి ప్రతిభానైపుణ్యానికి ప్రతీకగా కనిపిస్తుందని అన్నారు.

ఈ పారిశ్రామికవాడ సమీపంలో విద్యావసతులు, ఇతర మౌళిక సదుపాయాలను మెరుగుపరచడానికి చేయూతనివ్వాలన్న శ్రీసిటీ అభ్యర్థనకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ తన సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

మహిళలకు భారీ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంతంలో అనూహ్య మార్పు తెచ్చి మహిళలలో చైతన్యాన్ని తీసుకొచ్చిన శ్రీసిటీ యాజమాన్యాన్ని, పారిశ్రామికవాడ ప్రగతిని శ్రీమతి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు.



వేమిరెడ్డి దంపతులకి శ్రీసిటీ స్ఫూర్తిప్రదాత, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు శ్రీసిటీ సాధించిన విజయాలను తమ భవిష్యత్ లక్ష్యాలను రవిరెడ్డి వివరించారు. విపిఆర్ దంపతులను సత్కరించి జ్ఞాపికలని అందజేశారు.

# జగన్‌ను అదే పనిగా విమర్శిస్తే... సరిపోతుందా!?

అయ్యవార్లు ఏం చేస్తున్నార్రా.... అంటే, చేసిన తప్పులు దిద్దుకుంటున్నార్రా.. అన్నాట్ట ఒకడు, వెనకటికి.

ఆంధ్ర జనం పరిస్థితి ఆ అయ్యవారి లాగా ఉన్నట్టు కనబడుతోంది. చంద్రబాబును 2014లో గెలిపించారు. 2019 వచ్చేసరికి నాలిక కరుచుకున్నారు. చంద్రబాబును గెలిపించినందుకు చంపలేసుకున్నారా అన్నట్టుగా... వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించారు. ఇప్పుడు 2024 వచ్చింది. జనం మళ్ళీ చెంపలేసుకుంటున్నారు. వారి ముందేమో ఎక్కువ ప్రత్యామ్నాయాలు లేవు. అయితే ఎడమ చెయ్యి. కాకపోతే, పుర చెయ్యి. జనానికి మరో ఆప్షన్ లేకుండా పోయింది.

వై.యస్.రాజశేఖరరెడ్డి ఏకైక కుమారుడు అయిన జగన్‌మోహన్‌రెడ్డికి 2019 ఎన్నికలకు ముందు ప్రజలలో ఉన్న పొలిటికల్ ఇమేజ్, ఆకర్షణ, గుడ్ విల్, జనంలో వెల్లువెత్తిన సద్భావన... మాటలకు అందనిది. ఇప్పటి ఆయన పొలిటికల్ ఇమేజ్, జనాకర్షణ, గుడ్ విల్, సద్భావన మొదలైన పదాలు... అప్పటి వాటితో పోల్చుకోడానికే వీలులేకుండా వెలా... తెలా పోతున్నాయి.

'అప్పటి జగన్' అందరివాడుగా కనిపిస్తే.. ఇప్పటి జగన్ ఎవరివాడో తెలిసిన వాళ్ళు రాష్ట్రంలో పెద్దగా కనబడడం లేదు.

నీరు.... ఏ రంగు పాత్రలో పోస్తే... ఆ రంగు ఆకారంలో కనిపించినట్టుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, వ్యవస్థలు అనే నీరు... జగన్ అనే పాత్రలో చక్కగా ఇమిడిపోయినట్టుగా కనపడుతున్నాయి. ఏ గూటి చిలుక ఆ గూటి పాట పాడినట్టుగా ప్రభుత్వ వ్యవస్థలన్నీ జగన్ రాగం ఆలపిస్తున్నాయి అనే భావం ప్రజలలో బాగా బలంగా వ్యాపించిపోయింది.

నిజమే. జగన్ నేతృత్వం వహించే ప్రభుత్వ యంత్రాంగం నిష్క్రియాపరత్వం మీద, ఆయన రాజకీయ ప్రత్యర్థుల మీద వారు ప్రదర్శించే కక్ష, కార్పణ్యాల మీద, వారి దాష్టికాల మీద సోషల్ మీడియాలో కథనాలు... ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాయి. రాజకీయ విమర్శలకు లెక్కే లేదు.

ఇప్పటికి పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రి గాను, మరో పదిహేను సంవత్సరాలు ప్రతిపక్ష నాయకుడిగాను తెలుగు ప్రజలకు సేవలు అందించిన నారా చంద్రబాబునాయుడు మరోసారి తన రాజకీయ అదృష్టం పరీక్షించుకోడానికి జగన్ విధానాలు బాగా దోహదం చేస్తున్నాయి. మరోసారి అధికారం చేపట్టడానికి చంద్రబాబు మానసికంగా సిద్ధం అయ్యారు.

గతంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో సహా దేశంలోని చాలా రాష్ట్రాల్లో.... ప్రతిపక్షంలో ఉన్న నేతలు అధికారంలోకి రావడానికి గట్టిగానే కృషి చేసిన దాఖలాలు ఉన్నాయి గానీ, చంద్రబాబునాయుడు లాగా రేయింబవళ్ళు చమటోడ్చిన నేతలు ఒక్కరు కూడా కనపడరు. 'రాజకీయం' తప్ప ఆయన జీవితానికి మరో పార్శ్వం ఉన్నట్టు కనపడదు. గాలి పీల్చితే... రాజకీయం. పీల్చిన గాలి వదిలితే... రాజకీయం. బహుశా, ఈ లక్షణం వల్లనే ఆయన తెలుగుదేశంపార్టీని నిలుపుకోగలిగి ఉంటారు.

ఆయనకు ఇప్పుడు 'జనసేన' పేరుతో పవన్ కళ్యాణ్ తోడయ్యారు.

జగన్ వ్యవహారశైలిని, ఆయన నేతృత్వం వహించే ప్రభుత్వ యంత్రాంగపు నిర్వాకాలను విమర్శించడానికి నిజానికి వంద కారణాలు ఉన్నాయనేది పరిశీలకుల భావన. జనం ఓ పక్కన ఆ పని చేస్తూనే ఉన్నట్టుగా కూడా ఉంది.

ఈ పరిస్థితుల్లో... జగన్ స్థానంలో అధికారంలోకి రావాలని భగీరథ ప్రయత్నం చేస్తున్న చంద్రబాబునాయుడు, ఆయనకు సహకరిస్తున్న పవన్ కళ్యాణ్ కూడా జగన్‌ను వంద రకాలుగా విమర్శిస్తున్నారు. అయితే, జనానికి తెలియని కొత్త అంశం వారు ఏమి చెబుతున్నారు – అనేది పాయింట్.

రాష్ట్రం ఎన్నికల మూడ్‌లోకి వచ్చేసింది.

అటు జగన్ కూడా తాడేపల్లి క్యాంపు ఆఫీస్ వదిలి బయటకు వస్తున్నారు. ఇటు చంద్రబాబునాయుడు 'రా! కదలి రా..!!' అంటూ రాష్ట్రం నలుమూలలా పర్యటిస్తున్నారు. ఆయన పిలుపుకు జనం భారీగానే స్పందిస్తున్నారు. ఆ స్పందనలో జగన్‌పై వ్యతిరేకత కనిపిస్తోంది. అందుకే, ఆయన సభలకు జనం తరలి వస్తున్నారు.

అయితే... జగన్‌ను, ఆయన నేతృత్వం వహించే ప్రభుత్వ నిర్వాకాలను విమర్శించడానికే ఈ సభలను చంద్రబాబునాయుడు వాడుకుంటున్నారు. పంచ్ డయలాగ్‌లతో జనం చెప్పట్లకే వాడుకుంటున్నారని కూడా అనిపిస్తోంది.

తాను అధికారంలోకి రావడం ఖాయమని... తనను, తన పార్టీని ఇబ్బందులకు గురిచేసిన వారికి వడ్డీతో చెల్లిస్తానని ఆయన చెబుతున్నారు. అంటే... జగన్ లాగానే తానూ అరాచకాలకు పాల్పడతాను అని చంద్రబాబునాయుడు చెబుతున్నారా? పోలీసు వ్యవస్థను సొంత ప్రయోజనాలకు నిస్సంకోచంగా వినియోగించుకుంటాం అని ఆయన జనానికి చెబుతున్నారా? ప్రజలు ఒక ఆత్మ గౌరవంతో, రాజకీయ






నాయకుల ముసుగుల్లో ఉన్న వారిని చూసి భయపడకుండా... నిబ్బరంగా తమ జీవనం తాము సాగించుకునేందుకు వీలు కల్పించే పాలనను అందించడం కోసం... ప్రజలు చంద్రబాబును గెలిపించాలా....లేక, జగన్ బృందంపై ప్రతీకార కక్షలు తీర్చుకునేందుకు చంద్రబాబును గెలిపించాలా?

జగన్ గురించి చంద్రబాబునాయుడు తన బహిరంగ సభల్లో చెప్పే అంశాల్లో... ప్రజలకు తెలియంది బహుశా ఒక్కటి కూడా ఉండి ఉండదు. తెలియందల్లా... చంద్రబాబును గెలిపిస్తే, ఆయన పాలన ఎలా ఉంటుందీ అనేదే.

చంద్రబాబు చెప్పాల్సింది ఆ విషయం. అది తప్ప, మిగిలిన అన్ని విషయాలూ ఆయన మాట్లాడుతున్నారు. "ఇదిగో! నేను అధికారంలోకి వస్తే, ఈ రకమైన అభివృద్ధి చేస్తా! నిరుద్యోగ నియంత్రణకు నాకున్న ఆలోచనలు ఇవి. బీసీ సంక్షేమం కోసం ఈ ఆలోచనలు చేస్తున్నా. యస్‌సీ, యస్‌టీలను ప్రధాన జీవన స్రవంతిలోకి ఈ రకంగా తీసుకు వద్దామనుకుంటున్నా. మా పార్టీ నేతలు అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడరు. కొండలు, మట్టిదిబ్బలు తవ్వే



యరు. అక్రమ మైనింగ్‌కి పాల్పడరు. ప్రభుత్వ భూముల (ఇంకా మిగిలిఉంటే గనుక!)కబ్జాకు పాల్పడరు. లేఔట్‌లు, ప్లాట్‌లు వేసి అమ్ముకోరు. నాదీ హామీ... మీ ఆలోచనలు కూడా ఆహ్వానిస్తున్నా. మనందరం కలిసి రాష్ట్రాన్ని ఈ విధంగా ముందుకు తీసుకువెళదాం..." అన్న రీతిలో ఆయన ప్రసంగాలు సాగాలి కదా! అలా సాగుతున్నాయా?

చాలా పాత తెలుగు సినిమాల్లో హీరో, హీరోయిన్ పెళ్లితో సినిమా ముగిసే రీతిలో...., చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతోనే తెలుగు రాజకీయం ముగింపుకు వచ్చినట్టుగా చాలామంది రాజకీయ నేతల ప్రసంగాలు ఉంటున్నాయి.

ముఖ్యమంత్రి పదవి ఆయనకు కొత్త ఏమీ కాదు. ఇప్పటికి మూడుసార్లు అయ్యారు. అయితే, ఇంకోసారి అవుతారు. అదిగాదు, పాయింటు. అయితే ఏమి చేస్తారు అనేది కొశ్చను. ప్రజలకు ఏ మేరకు ఉపశమనం కలుగచేస్తారు అనేది కదా పాయింటు.

ఆయనకు ఈ రాబోయే ఎన్నికల్లో బేషరతుగా మద్దతుగా నిలబడిన పవన్ కళ్యాణ్ కూడా నెగటివ్ పాలిటిక్స్ వదిలేయాలి. రేపు ప్రభుత్వంలోకి వస్తే, ఏమి చేయాలని తాను అనుకుంటున్నారో ప్రజలకు చెప్పాలి.

అలా ఇద్దరూ, పాలనకు సంబంధించి తమ బ్లూ ప్రింట్‌ను ప్రజల ముందు ఆవిష్కరించాలి. దానివల్ల, ప్రజలకు మరింత భరోసా కలుగుతుంది. వారు అధికారంలోకి రావలసిన ఆవశ్యకతపై ప్రజలకు మరింత స్పష్టత వస్తుంది.

జగన్ పాలనకు... టీడీపీ – జనసేన పాలనకు మధ్య ఉండే అంతరం బాగా తెలుస్తుంది.

అలా కాకుండా.... జగన్‌ను తక్కువగా అంచనా వేసి, ఊకదంపుడు కాలక్షేపం ప్రసంగాలతో ఎన్నికల వైతరణిని దాటడం కష్టం.

జగన్ "అమ్ముల పొది"లో ఉన్న అస్త్రాలతో పోల్చదగిన ఆయుధాలు బాబు – పవన్ కాంబినేషన్ వద్ద లేవు. వీరివద్ద ఉన్న "ప్రజా మద్దతు" అనే ఆయుధం జగన్‌కు అవసరం లేదు.

- జగన్ ఓటర్లు వేరు. సజ్జల రామకృష్ణారెడ్డే ఆ విషయం ఓపెన్‌గా చెప్పారు.
- ఆ ఓటర్లు వారికే కనిపిస్తారు గానీ, చంద్రబాబు –పవన్‌కు కనిపించరు.
- జగన్ పట్ల నరేంద్ర మోడీ ఆదరణలో మార్పు లేదు.
- యథా మోడీ... తథా ఎన్నికల సంఘం...
- జగన్‌కు బాసటగా పోలీసు, రెవిన్యూ యంత్రాంగం.
- వాలంటీర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది అదనం.

అందుకే, 175కి 175 అని జగన్ అంటున్నారు అని చాలామంది అనుమానిస్తున్నారు. 175కి 175 కాదు...175కి 100 వస్తే మాత్రం లాస్ ఏముంది?

ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో.... తెలుసుకోనంతకాలం ప్రజలు మోసపోతూనే ఉంటారు! –లెనిన్.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# రచ్చకెక్కిన 'రాజ'కుటుంబం

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు ప్రజలకి స్వచ్ఛమైన, నిస్వార్థమైన, నీతివంతమైన, ప్రజోపయోగకరమైన, ప్రజారంజితమైన , ప్రజామోదమైన పాలన అందించాలన్న లక్ష్యంతో, ఆశయంతో, దీక్షతో మూడు దశాబ్దాలు ప్రజలలో మమేకమై, ప్రజానాయకుడై, ప్రజల ఆశీస్సులతో 2004లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన ఘనచరిత్ర రాజశేఖర రెడ్డిది. రాష్ట్రంలో పదేళ్ల ప్రాంతీయపార్టీ ఆధిపత్యంలో జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌పార్టీని ఒంటిచేత్తో కాపాడిన నాయకుడు డాక్టర్ వై.ఎస్.ఆర్.

మహాత్మాగాంధీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహం పాదయాత్రని తలపించేలా, తన ప్రాణాలని పణంగాపెట్టి చేవెళ్ల నుండి ఇచ్ఛాపురం వరకు 'రాజన్న' చేపట్టిన 'ప్రజాప్రస్థానం' పాదయాత్ర భారతదేశ చరిత్రలోనే ఒక సంచలనం.

ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరువాత అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తమ ప్రధాన అజెండాగా ఆయన తన పాలన సాగించారు. రైతులకి ఉచిత విద్యుత్ అందజేశారు, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రధాన ప్రాధాన్యతనిచ్చారు. మహిళలకి పావలా వడ్డీకి రుణాలు ఇచ్చారు. విద్యార్థినీవిద్యార్థులకి ఫీజు రీఎంబర్స్‌మెంట్ ప్రారంభించారు. పేద, గొప్ప అన్న తారతమ్యం లేకుండా అందరికీ కార్పొరేట్ వైద్యం అందేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణాలలో, నగరాలలో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పంచాయతీలను మునిసిపాలిటీలుగా, మునిసిపాలిటీలని కార్పొరేషన్లుగా మార్చారు. ఎటుచూసినా అభివృద్ధి సంక్షేమమే కనపడేలా సుపరిపాలన సాగించారు. ఏ ఒక్క పథకం ద్వారా కూడా ప్రజల ఖాతాలలోకి నేరుగా డబ్బు పంపలేదు. అవసరమైన చోట అవసరమైన వారికి... వారికి కావలసిన మేరకే సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఆయన దివంగతులై 14 సంవత్సరాలు గడిచిపోయినా ఈ రోజుకీ ఆయన ప్రతి తెలుగువారి గుండెలో కొలువైవున్నారు. కొన్ని వేల కుటుంబాల పూజ గదులలో దైవమై నిలిచారు. కానీ, ఆయనకి జన్మించిన ఇద్దరు బిడ్డలు ఆయన మనస్తత్వాన్ని, ఆయనలో ఉన్న గుణాలను, ఆయన లక్షణాలను, ఒక్కటి కూడా లేకుండా ఉండడం ఆయన కుటుంబ అభిమానులను, ఆయన ప్రాణ స్నేహితులను, ఆయన హితులను, సన్నిహితులను, ఆయన అనుచరులను బాధిస్తున్న అంశం. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్‌లో చేరడం, ఆంధ్ర పార్టీకి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టడం, ఆ వెంటనే తన అన్నపైన, ఆయన పాలనపైనా ధ్వజమెత్తడం వై.ఎస్. భక్తులను మనస్తాపానికి గురిచేస్తోంది. ఇన్నాళ్లూ గొడవలు వున్నాయట, షర్మిల వస్తుందట, జగన్‌పై విమర్శలు గుప్పిస్తుందట, ఇంటి గుట్టు రచ్చకీడుస్తుందట అనే ఊహాజనిత విమర్శలు నిజం చేస్తూ ఆమె నిజంగానే బరిలో దిగింది. అన్నపై విమర్శనాస్త్రాలు గుప్పిస్తూ ప్రజాక్షేత్రంలో తిరగడం ప్రారంభించింది. వై.ఎస్. వారసులిద్దరి వ్యవహారశైలిని ఒక్కసారి గమనిస్తే....

## వ్యక్తిత్వంలో వై.ఎస్.ని మరిపించలేకపోతున్న జగన్

స్నేహభావంలో, సమాజహితంలో 'తన' అన్నవారిని చేరదీయడంలో జగన్ మోహన్‌రెడ్డికి తన తండ్రి రాజశేఖరరెడ్డి లక్షణాలు రాకపోయినా, ఆయన పౌరుషం, పట్టుదల, కార్యదక్షత వంటి గుణాలు మాత్రం వచ్చాయి. ఎంతటి వారినైనా ఎదిరించే ధీరత్వం, అనుకున్నది సాధించే తత్వం, తనను ఎవరైనా విమర్శిస్తే తిరిగి ఘాటుగా సమాధానం చెప్పే పౌరుషం జగన్‌కి బాగా అబ్బాయి. ప్రజల సంక్షేమం కోసం లక్షల కోట్ల రూపాయల డబ్బుని బటన్ నొక్కడం ద్వారా ప్రజల ఖాతాలలో నేరుగా జమ చేస్తున్నారు తప్ప, వారికి శాశ్వతంగా లబ్ధి చేకూరే సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రారంభించడం లేదన్న విమర్శని ఎదుర్కొంటున్నారు. ఒక్క నీటి నిర్మాణ ప్రాజెక్టుని కూడా చేపట్టకపోగా, గ్రామీణ, పట్టణ, నగర ప్రాంత రహదారులని నిర్లక్ష్యం చేశారన్న అపవాదుని మూటగట్టుకున్నారు. కాంట్రాక్టర్ల వ్యవస్థని నిర్వీర్యం చేసేశారన్న అపఖ్యాతిని కూడా ఆయన సొంతం చేసుకున్నారు. తన చుట్టూ ఆ నలుగురూ తప్ప వేరొకరికి స్థానం లేదన్నట్లుగా మంత్రులకి, ఎంపిలకి, ఎంఎల్ఏలకి సైతం సమయం ఇవ్వకుండా ఈ నాలుగున్నర సంవత్సరాలు కాలక్షేపం చేసేశారన్న నిందను కూడా మోస్తున్నారు. పాలనలో, ప్రవర్తనలో, ప్రజా సంబంధాలలో తండ్రికి కొడుకుకీ పోలికే లేదని ఆయన కుటుంబసభ్యులే చేస్తున్న విమర్శ.

## తప్పటడుగులు వేస్తూ వెళ్తున్న షర్మిల!

నాన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆమెకు రాజకీయం తెలియదు. అప్పుడు ఆమె ప్రజల మధ్యకు రాలేదు. తండ్రి చాటు బిడ్డగానే ఎదుగూరు సందింటి ఆడపడుచుగానే పెరిగారు. తండ్రి ఆకస్మిక మరణం, అన్న అక్రమ అరెస్టు ఆమెను ప్రత్యక్ష రాజకీయాలలోకి లాగాయి. తప్పని పరిస్థితులలో అన్నకు తోడుగా బరిలో దిగేలా చేశాయి. అన్నకి నైతిక మద్దతుగా కొన్ని వేల కిలోమీటర్లు నడిపించాయి. కానీ, అన్న ముఖ్యమంత్రయ్యాక ఆమె వ్యవహారశైలి మారింది. వరుసగా తప్పటడుగులు వేస్తూ వస్తున్నారు. వైఎస్ కుటుంబానికి బద్ధశత్రువైన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణతో ఆమె చేతులు కలిపారు. అది ఆమె వేసిన తొలి తప్పటడుగు. తెలంగాణలో పార్టీ పెట్టారు, అక్కడ అధికారంలోకి రావాలని ప్రయత్నించారు. అది ఆమె రెండవ తప్పటడుగు. అక్కడి ప్రజలు ఆదరించకపోవడంతో అక్కడ రాజకీయ దుకాణం మూసేసి, తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేసి, అదే కాంగ్రెస్ వేదికగా ఆంధ్రలో అడుగుపెట్టారు షర్మిల. నిజానికి ఆమె ఈ పని తెలంగాణలో పార్టీ పెట్టకముందే చేసుండాలి. కానీ, అన్నపై తిరుగుబాటు చేయలేక, తగిలించుకున్న రాజకీయాలకు దూరంగా ఉండలేక ఆమె తెలంగాణని ఎంచుకున్నారు. అక్కడ హడావుడి చేశారు, పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు. అయినా ఫలితం లభించలేదు. చివరికి కాంగ్రెస్ చొరవతో తిరిగి పుట్టింటికి చేరారు.

## ఆంధ్రాలో చిత్రవిచిత్ర పరిస్థితులు!

ఆంధ్రాలో ఇప్పటికే, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, రాష్ట్ర బీజేపీ (కేంద్ర బీజేపీ కాదు), వామ పక్షాలు జగన్‌కు ఎదురొడ్డి పోరాడుతున్నారు. మీడియాలో ఓ బలమైన వర్గం, కొన్ని కుల సంఘాలు, సోషల్ మీడియాలో పెద్ద వర్గం... జగన్‌కు వ్యతిరేకంగా మోహరించి రేయింబవళ్ళు ప్రజాక్షేత్రంలో పని చేస్తున్నాయి. ఇప్పుడు ఈ శక్తులకు వైయస్ షర్మిల జత కలిశారు.

షర్మిల మంచి మాటకారి. జనాకర్షణ కలిగిన మహిళ కూడా. పైగా రాజన్న బిడ్డ. జగన్‌పై ఎంత మత ముద్ర ఉందో, షర్మిలపై కూడా అంతకంటే పెద్ద ముద్రే ఉంది. పైగా ఆమె భర్త 'బ్రదర్ అనిల్' ఏకంగా క్రైస్తవ మత ప్రచారకుడు కూడా.

మహానేత రాజన్న వారసత్వం, రాజకీయ నేపథ్యం, కులం, మతం, ఆ కుటుంబం పట్ల జన సామాన్యంలో వ్యక్తమయ్యే సానుకూలాభిప్రాయాల వంటి అంశాలు షర్మిల చుట్టూ వెలుగు చక్రాల్లా జనానికి కనపడుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో రాజన్న బిడ్డలు ఇద్దరూ సమ ఉజ్జీలుగా మాటల యుద్ధానికి తెగబడతారని రాజకీయవర్గాలు వేసిన అంచనా తప్ప లేదు. ఇప్పటికే ఆ యుద్ధం మొదలైపోయింది. షర్మిల నేరుగానే అన్నపైన వాక్బాణాలని సంధిస్తున్నారు. జగన్ పరోక్షంగా మాట్లాడినా ఆయన సైన్యాధ్యక్షులు మాత్రం తెగబడి తిరగబడుతున్నారు. బంధుప్రీతి, బాంధవ్యాలు వంటివి మీకే లేనప్పుడు మాకెందుకు అన్నట్లుగా మాటకి మాట సమాధానమిస్తున్నారు.

అయోధ్యలో రాముని విగ్రహానికి ప్రధాని మోదీ "ప్రాణ ప్రతిష్ట" చేసినట్టుగా, ఆంధ్రలో కాంగ్రెస్‌కు "ప్రాణ ప్రతిష్ట" చేయడానికి షర్మిల సిద్ధం అయ్యారు. ఇందుకు, వెనుక నుంచి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ముందు నుంచి కేవీపీ రామచంద్రరావు దర్శకత్వం వహిస్తున్నారు.

నిజానికి, కేవీపీ రామచంద్రరావుకు షర్మిల ఎంతో, జగన్ కూడా అంతే అంటారు ఆ రెండు కుటుంబాల సన్నిహితులు. వాళ్ళు, తమ చిన్ననాటి రోజుల నుంచీ ఆయనను "క్యాప్టన్ అంకుల్" అని పిలిచేవారు. అయితే, ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో నిర్ణయాలు తీసుకున్న జగన్, కాంగ్రెస్‌ను వదిలేసుకోవడంతో పాటు 'పుట్టు కాంగ్రెస్' అయిన కేవీపీని కూడా వదిలేసుకున్నారు.

ఇప్పుడు, కేవీపీ షర్మిలను ఆంధ్రలోనే కాకుండా ఢిల్లీలో కూడా పూర్తిస్థాయిలో ప్రమోట్ చేయడానికి తన సమయాన్ని, మేధస్సుని వెచ్చించి పనిచేస్తారని గతంలోనూ, ఇప్పుడూ కాంగ్రెస్‌లో ఆయనతో కలసి సన్నిహితంగా పనిచేస్తున్న వారు అభిప్రాయపడుతున్నారు.

ఇక, షర్మిల–జగన్‌ల విషయానికి వస్తే జగన్‌కు ఉన్న పరిమితులు షర్మిలకు లేవు. జగన్‌కు తెలుగు భాషపై కమాండ్ లేదని అంటారు. షర్మిల తెలుగులో సూటిగా, స్పష్టంగా, ఎదుటివారిని ఆకట్టుకునేలా గలగలా మాట్లాడతారు. బహిరంగ సభల్లో సైతం జగన్ స్క్రిప్ట్ చూసుకుని, పట్టి పట్టి చదువుతారనే భావం ఉంది. షర్మిలకు ఆ బాదరబందీ లేదు. మైకు పట్టుకుంటే చితక్కొట్టేస్తారని రాజకీయవర్గాల అభిప్రాయం. ఒక పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన స్పురద్రూపి అయిన మహిళ, సహజంగానే ఆమె చూపరులను జగన్‌తో సమానంగా ఆకర్షించగలుగుతారు. ఆమె రంగప్రవేశంతో, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ 'పని' తేలిక అయిందనే వ్యాఖ్యలు రాజకీయవర్గాలలో వినిపిస్తున్నాయి.

నిజానికి, షర్మిలకు కాంగ్రెస్ పెద్ద పెద్ద హామీలే ఇచ్చి రంగంలోకి దింపి ఉంటుందనే చర్చ కూడా రాజకీయవర్గాల్లో సాగుతోంది. కర్ణాటకతో పాటు, తెలంగాణలో కూడా కాంగ్రెస్ చేతికి అధికారం చిక్కడంతో ఆంధ్రలో పునరుద్ధరణకు అవసరమైన అర్థబలానికి లోటులేదన్నది జగమెరిగిన సత్యం. కాంగ్రెస్‌లో అంత్యంత జనాకర్షణ నేతగా ఎదిగిన డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డిని గుర్తుకుతెచ్చే ఆయన కుమార్తె ఇప్పుడు ఆంధ్ర కాంగ్రెస్ "చేతి"కి దొరకడం కొనఊపిరితో వున్న పేషెంటుకి సూపర్ స్పెషాలిటీ వైద్యులు దొరికినట్లే. ఈ సమీకరణలన్నీ చంద్రబాబునాయుడుకి బోనస్‌లా పనికొస్తాయన్నది రాజకీయ వర్గాల అభిప్రాయం. వైసీపీ మద్దతుదారులలో ఎక్కువమంది పూర్వపు కాంగ్రెస్ వాదులు, వైయస్ అభిమానులు, సానుభూతిపరులు ఉన్నారన్నది కూడా బహిరంగ రహస్యం. ఇప్పుడు, వారిలో చాలామంది మళ్ళీ కాంగ్రెస్ వైపుకు తిరిగిచూసే అవకాశాలు ఉన్నాయి. ఆ మేరకు వైసీపీకి నష్టం కలిగించే పరిస్థితులు లేకపోలేదు. ఇప్పటి వరకూ కాంగ్రెస్ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోని వారు, ఇప్పుడు లెక్కలు సవరించుకుంటున్నారు. షర్మిల రంగప్రవేశం చేసిన ఫలితంగా, ఎంత శాతం మేరకు కాంగ్రెస్‌కు ఓట్లు లభిస్తే... ఆ మేరకు వైసీపీ నష్టపోతుందనే అంచనాలు ఆంధ్రలో మొదలయ్యాయి.

2019లో "జగన్ గాలి" ఒక ఉప్పెన కెరటంలా రాష్ట్రంపై విరుచుకుపడిన పరిస్థితులలోనే, టీడీపీకి 39 శాతం ఓట్లు లభించాయి. ఇప్పుడు వైసీపీకి 2019 నాటి రాజకీయ అనుకూల పరిస్థితులు లేవు అన్నది కూడా బహిరంగ రహస్యమే. అదే సమయంలో, అప్పుడు టీడీపీకి వచ్చిన ఓటు శాతం నుంచి ఇప్పుడు వైసీపీకి వెళ్లే వర్గాలు కూడా ఏమీ కనపడడం లేదు. అందువల్లే, ఇప్పుడు... ఏపీ రాజకీయాల్లో షర్మిల కీలకంగా మారారు. ఆమె ఎన్ని ఓట్లు లాక్కుంటే, టీడీపీకి అంత లాభం అనే మాటలు విశ్లేషకుల నోట వినపడుతున్నాయి. పొరుగింటి పోరు చంద్రబాబుకి కలిసొస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మొత్తంమీద ఆంధ్రాలో అన్నా, చెల్లెళ్ళ 'రాజ'కీయ పోరాటానికి తెరలేచింది. గత కొన్ని నెలలుగా ఊహాజనితంగా ఉండిన ఇంటిపోరు రచ్చకెక్కింది. ఇన్నాళ్లూ 'రాజసం' సంతరించుకున్న రాజన్న కుటుంబం వీధులలోకి వచ్చింది. ఎటుచూసినా ఇద్దరూ తమ ప్రియతమ నాయకుడి బిడ్డలు. 'హతవిధీ... ఏమిటి మా విధి' అంటూ వై.ఎస్. అభిమానులు విచారిస్తున్నారు. 'రాజన్నా క్షమించు' అంటూ మౌనంగా విలపిస్తున్నారు...!

# రామరాజ్యం రావాలి

(మొదటి పేజీ తరువాయి)

అయోధ్యరామయ్య తిరిగి తన ఇంటికి వచ్చేశాడు. ఆ కమనీయ.. రమణీయ దృశ్యాలను ప్రసార మాధ్యమాల్లో వీక్షించిన భక్తకోటి తరించిపోయారు. రామ భక్తులు సగర్వంగా 'జై శ్రీరామ్' అంటూ ఉప్పొంగిపోయారు. అంతా రామ మయం.. ఈ జగమంతా రామమయం అన్నట్లుగా రామావతరణంతో ప్రపంచానికే నూతనోత్సాహం వచ్చినట్లయింది. ఎట్లయితేనేం.. 'రాముడొచ్చాడు.. ఇక రామ రాజ్యం రావాలి.. భవ్యభారత్ సాకారం కావాలి.. అన్నదే ఇప్పుడు భారతీయులందరి మనసుల్లోని ఆకాంక్ష!..

'రాముడొచ్చాడు..ఇది ప్రపంచ చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయం. రామ్ లల్లా ఇక టెంట్‌లో ఉండాల్సిన పనిలేదు.. అద్భుతమైన ఆలయంలో కొలువైవుండి ప్రజల పూజలందుకుంటాడు'.. అని ప్రధాని మోదీ పరవశం చెందారంటే, అందుకు ఎంతో నేపథ్యం ఉంది. అయోధ్యలో రామమందిరం స్థాపన వెనుక ఎన్నో కష్టనష్టాలున్నాయి. దాదాపు అయిదు వందల సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు, మహనీయుల త్యాగాలు, బలిదానాల తర్వాత మళ్ళీ అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరిగింది. ఎంతోకాలంగా రాముడు ఒక చిన్న టెంట్‌లోనే ఉండే పరిస్థితి నుంచి ఒక దివ్యమైన మందిరంలోకి రావడం ఒక అద్భుతం. జనవరి 22న జరిగిన ఈ చరిత్రాత్మక సన్నివేశం ప్రపంచ ప్రజలను సైతం ఎంతగానో ఆకట్టుకుంది. ప్రధాని మోదీ సారథ్యంలో, రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ నేతృత్వంలో అయోధ్య రామమందిరం అద్వితీయంగా రూపుదిద్దుకోవడం, రాముని విగ్రహ ప్రతిష్ట జరగడంతో కొత్త శకానికి శ్రీకారం చుట్టినట్లయింది. దీంతో భారత్ భవిష్యత్తు కూడా ఎంతో ఆశావహంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఆ ఆకాంక్షలు నెరవేరే దిశగా ప్రధాని మోదీ భవిష్యత్ ప్రగతి పథకాలకు సమాయత్తం కావాలని అందరూ ఆశిస్తున్నారు.

## రాముడు లోకానికే ఆదర్శం

రాముడు భారతీయుల గుండెల్లో కొలువై ఉన్న దేవుడు. అందుకే రాముడన్నా, రామమందిరమన్నా, రామాయణమన్నా ఎంతో అభిమానం. దేశంలో సీతా రాముల మందిరాలు లేని ప్రాంతం ఉండదు. అంతగా ప్రజలు తమ గుండెల్లో గుడికట్టుకుని శ్రీరాముని పూజించుకుంటున్నారు. ప్రధాని మోదీ అభివర్ణించినట్లుగా 'రాముడంటే నిప్పు కాదు..శక్తి. రాముడంటే వివాదం కాదు...సమాధానం'. అంతేకాదు, 'రాముడు ఈ లోకానికే ఆదర్శం. రాముడే భారతీయ విధానం..రాముడే భారతావనికి ఆత్మ. రాముడే మనదేశపు కీర్తి పతాక.. ఆయనే శాశ్వతం..ఆయనే విశ్వం' అని అద్భుతంగా ఆయన ఉద్వేగంగా చెప్పారు. ఏదేమైనా ఈనాటికి రామమందిరం కల సాకారమై, 'ఆలయ నిర్మాణం పూర్తయింది..ఇక దేశ నిర్మాణం జరగాల్సి ఉంది. వికసిత్‌భారత్‌కు, భవ్యభారత్‌కు అదే స్ఫూర్తితో అడుగులుపడాలి. ఆ మేరకు బృహత్తర కార్యాచరణకు కేంద్రం కంకణం కట్టుకోవాలి. దేశంలో పేదరికం.. అసమానతలు తొలగిపోయి ప్రజలంతా ప్రగతి ఫలాలు అందుకోవాలని, అభివృద్ధిపథంలో మనదేశం ప్రపంచంలోనే అగ్రగామి పథానికి చేరుకోవాలని, భారత్‌లో మళ్ళీ రామ రాజ్యం రావాలని ప్రజలంతా మనసా వాచా కోరుకుంటున్నారు.

## పర్యాటక ప్రాంతంగా కూడా

అయోధ్య రామాలయానికి నిత్యం సుమారు ఒకటిన్నర లక్షమంది దాకా భక్తజనం వస్తారని, ఏటా కనీసం 5 కోట్ల మంది సందర్శకులు రావచ్చని అంచనా. అయోధ్యలో రామాలయం నిర్మాణంతో పాటు అంతర్జాతీయస్థాయి విమానాశ్రయం, ఆధునికమైన రైల్వేస్టేషన్, పెద్దపెద్ద హోటళ్ళు, అతిథిగృహాలు సమస్త సౌకర్యాలు కలుగజేస్తుండడంతో అయోధ్య ప్రపంచవ్యాప్తంగా ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా కూడా రూపుదిద్దుకుని, తద్వారా భారత పర్యాటక రంగానికి భారీస్థాయిలో ఊతమిస్తుందని కూడా నిపుణులు అంచనా వేస్తున్నారు.

# రాముని పల్లకి మోసిన.. కొండ్రెడ్డి



అయోధ్యలోని శ్రీరామ మందిరంలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం శ్రీరామ భక్తుల నగర సంకీర్తన, భజనలు, ప్రాణ ప్రతిష్ఠ ఆధ్యాత్మిక ప్రత్యేక పూజా కార్యక్రమాలను అల్లూరు మండలంలోని నార్త్‌మోపూరు గ్రామంలో రామ భక్తులు కోలాహలంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని శ్రీరామునికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీరాముని పల్లకిని మోశారు. అయోధ్యలోని రామ మందిరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న నేపథ్యంలో ఆ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని కనులారా వీక్షించేందుకు నార్త్ మోపూరు గ్రామంలో శ్రీరాముని భక్తులు పెద్దపెద్ద ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. వైకాపా నాయకులు వై.శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, జెట్టి చైతన్య, కె.శ్రీనివాసులు, గునపాటి సుజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## బ్రహ్మశ్రీ 'పోలూరి' రచనలపై 26న.. ఉపన్యాసం

'ఆంధ్రవాల్మీకి' బిరుదాంకితుడు, ప్రసిద్ధ ఆధ్యాత్మిక గ్రంథకర్త బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరులో జనవరి 26న మూడవ సాహితీ సమావేశం జరుగనుంది. స్థానిక పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు టౌన్‌హాలులోని జూనియర్ ఆర్ఎల్ రెడ్డి భవనంలో జరిగే ఈ కార్యక్రమానికి పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. విశ్రాంత ఆంధ్రోపన్యాసకురాలు కె. గిరిజాలక్ష్మి పాల్గొని పోలూరి వారు రచించిన 'త్రిపురా రహస్య జ్ఞాన ఖండసారము-బాలప్రియ వ్యాఖ్యాన సహితం'పై ఉపన్యసిస్తారని నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి తెలిపారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులందరూ ఈ కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.



## రామయ్య రాక.. అవనికే పులకింత

రామ నామం..బహు రమ్యం
అది..పావన జీవన యానపు గమ్యం
కుమారుడంటే ఆయనలా ఉండాలంటారు
శిష్యుడంటే..ఆయన్ను చూసి నేర్చుకోవాలంటారు
'అన్న'గా ఆయనే ఆదర్శం
'భర్త'గా ఆయన ప్రేమే అపురూపం
'రామరాజ్యం'స్థాపకునిగా
రామచంద్రుని పాలన అపూర్వం!
యుగయుగాలకూ అది ఆదర్శం!
ధర్మనిరతికి రాముడే అక్షయ సాక్షాత్కారం
సత్యనిష్ఠకు శ్రీరాముడే నిలువెత్తు అవతారం
రాముని ఆగమనం
ఆబాలగోపాలానికీ కేరింత!
అయోధ్య రామయ్య రాక
అవనికంతటికీ పులకింత!
సర్వకాల సర్వావస్థల్లోనూ..సర్వులకూ
పఠనీయం.. శుభ స్మరణీయం..
రామాయణ చరితం!
మళ్ళీ త్రేతాయుగం వరకూ...
రామ నామస్మరణతో
రామాయణ పారాయణంతో
జగమంతా పరవశం!



బొగ్గరపు రాధాకృష్ణమూర్తి
98854 81939



# శ్రీరామ భజనలతో మార్మోగిన శ్రీసిటీ

'జై శ్రీరామ్..జై జై శ్రీరామ్'..అంటూ రామనామోచ్చారణలతో శ్రీసిటీ పరిసరాలు మారుమ్రోగిపోయాయి. రామ నామ స్మరణలతో శ్రీసిటీ ప్రాంతమంతా భక్తిభావంతో పులకించిపోయింది. జనవరి 22న దేశ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో, స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభించి పలు రకాల విశిష్టపూజలతో పాటు సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమ సమేత శ్రీ రాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా శ్రీరామ రక్ష హోమం చేపట్టారు. సరిగ్గా అయోధ్య ఆలయంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సమయానికి పూర్ణాహుతితో హోమం పూర్తి చేయడం విశేషం. అనంతరం, శ్రీరామ నామ పారాయణం, హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం నిర్వహించారు. శ్రీసిటీ పరిసర గ్రామప్రజలతో పాటు శ్రీసిటీలోని చిన్మయ, అకార్డ్ స్కూళ్లు, ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులు పెద్దఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మహా మంగళ హారతిని కళ్లకద్దుకున్న తర్వాత, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేశం మొత్తాన్ని భక్తి పారవశ్యం గావించిన అయోధ్య ఆలయ ప్రాణ ప్రతిష్ఠ రోజున శ్రీసిటీలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం, స్థానిక ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున ఇందులో పాల్గొని శ్రీరామచంద్రుని ఆశీస్సులు పొందడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



జాతీయ రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా నెల్లూరులోని ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉత్తీర్ణత పరీక్షకై హాజరైన అభ్యర్థులతో ఇటీవల రహదారి భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారి బాలమురళీకృష్ణ, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు పూర్ణచంద్రరావు, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదభరితమని తెలియజేశారు. డ్రైవింగ్ కూడా తమ సామాజిక బాధ్యతగా ఉండాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని, కారు నడిపే డ్రైవరు మరియు ముందు సీట్లో ప్రయాణీకుడు విధిగా సీట్ బెల్ట్ ధరించాలని కూడా చెప్పారు.

# విఎస్‌యులో నేతాజీ జయంతి



నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో ఇటీవల నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విఎస్‌యులోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ దేశభక్తి అందరికి ఆదర్శప్రాయమన్నారు. విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయానంద్‌కుమార్‌బాబు, సిహెచ్.విజయ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ కె.సునీత, సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్, డాక్టర్ జి సుజయ్, డాక్టర్ సిహెచ్. సాయి ప్రసాద్‌రెడ్డి, చాముండేశ్వరి పాల్గొన్నారు. అనంతరం, ఇటీవల హైదరాబాద్ జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను, మహారాష్ట్ర 27వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్న వలంటీర్లను అభినందించారు.

## టూకీగా...



### కోవూరులో పాడిరైతుల పథకాలపై సమీక్ష

మండల కేంద్రమైన కోవూరులో ఈనెల 23న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య ఆధ్వర్యంలో పాడిరైతుల పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసం విత్తనాలను రైతులకు 70శాతం సబ్సిడీతో అందజేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పశువైద్యులు డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ ప్రీతి పాల్గొన్నారు.

### సత్యవోలులో కోడిపందెంరాయుళ్ళ అరెస్ట్

కొండాపురం మండలం సత్యవోలు వద్ద సైగ్గా కోడిపందాలాట నిర్వహిస్తున్న అయిదుగురిని పోలీసులు ఈనెల 20న అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 3 కోడిపుంజులను, 2400 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కొండాపురం ఎస్ఐ ఖాజావలి ఆధ్వర్యంలో ఈ అరెస్టులు జరిగాయి.

### నెల్లూరు రూరల్‌లో ఎరువులపై అవగాహన

నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల, మన్నవరప్పాడు, దొంతాలి గ్రామాల్లో ఈనెల 23న నెల్లూరు వ్యవసాయశాఖ ఏడీఏ ఎన్ శ్రీనివాసులు పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. అధిక మోతాదులో ఎరువులు వాడడం వల్ల పంటపొలాలు దెబ్బతింటాయని, ఎకరాకు 40 కేజీల పొటాష్‌ను రెండుమూడు విడతలుగా వాడితే మంచిదని రైతులకు సూచించారు.

### కొత్తూరులో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

నెల్లూరు రూరల్‌లోని కొత్తూరులో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు ఈనెల 23న చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సుమారు వందమంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు డిజిటల్ సర్టిఫికెట్లతో పాటు స్వాతంత్ర్య యోధుల జీవితచరిత్ర పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. విద్యాలయం ప్రిన్సిపాల్ శంకరయ్య, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

### తోటపల్లిగూడూరులో ఉచిత వైద్యశిబిరం

తోటపల్లిగూడూరులోని జడ్పీ హైస్కూల్ మైదానంలో ఈనెల 21న నెల్లూరుకు చెందిన సుధీర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, గ్రామస్తులకు బీపీ, షుగర్, ఈసీజీ, కేన్సర్ స్క్రీనింగ్ తదితర పరీక్షలు చేసి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ధీరజ్, నాగమాణిక్యం తదితరులు పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు.

### ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

నెల్లూరు రూరల్‌లోని ధనలక్ష్మీపురంలో ఉన్న జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 21న రక్తదాన శిబిరం జరిగింది. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్, నోవా బ్లడ్‌బ్యాంక్‌ల ఆధ్వర్యంలో రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయ భాస్కర్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.

### కొడవలూరులో కులగణన పరిశీలన

కొడవలూరులో జరుగుతున్న కులగణనను ఈనెల 21న ఇఒపీఆర్డీ వి.డేవిడ్ పరిశీలించారు. కులాలవారీగా జన సంఖ్యను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడానికి వెసులుబాటు ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతి కార్యదర్శి జి.రాధాకృష్ణ, బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### సింగపేటలో గుర్తుతెలియని మృతదేహం

అల్లూరు మండలం కొత్త సింగపేట పొలాల్లోని ఓ ఊట బావిలో ఈనెల 21న ఓ మృతదేహాన్ని చూసి అల్లూరు పోలీసులకు చెప్పారు. గుర్తుతెలియని ఆ మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో ఆనవాళ్ళు తెలియడం లేదు. గుర్తు తెలుసుకునేందుకు పోలీసులు పరిశీలన చేస్తున్నారు. అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆ మృతదేహాన్ని బావి నుండి వెలికి తీయించి పోస్టుమార్టం కోసం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# దీపమ్మకు.. మరో విశిష్టపురస్కారం

## 'స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డు' ప్రదానం



స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమార్తె..సామాజిక సేవా పరాయణురాలైన దీపా వెంకట్ (దీపమ్మ) సేవలకు గుర్తింపుగా ఆమెకు మరో అరుదైన అవార్డు లభించింది. స్వామి వివేకానంద జయంతి నేపథ్యంలో ఏటా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను సత్కరించే తూర్పు గోదావరి జిల్లాలోని శ్రీరామ కృష్ణ సేవాసమితి–అనపర్తి వారు ఈ ఏడాదికి స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డును నెల్లూరుజిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి దీపా వెంకట్‌కు ప్రదానం చేయడం విశేషం. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నైపుణ్య శిక్షణ ద్వారా ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నందుకు గాను ఆమెకు ఈ అవార్డు బహుకరిస్తున్నట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. శ్రీ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్, అనపర్తి శాసనసభ్యులు డా. సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా ఆమెకు ఈనెల 24న ఆ అవార్డును అందజేశారు. దీపమ్మతో పాటు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, రాజమహేంద్రవరానికి చెందిన వైద్య నిపుణుడు, సంఘ సేవకుడు గోలి వెంకటరామారావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డిలకు ఇదే వేదిక మీద నిర్వాహకులు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు.



### నాన్నే.. నా స్ఫూర్తిప్రదాత - దీపమ్మ

తనకు సేవాభావంలో స్ఫూర్తినిచ్చింది తమ నాన్న వెంకయ్యనాయుడు గారేనని, వారందించిన ప్రేరణతోనే సేవారంగంలో ఉంటూ సమాజానికి తనవంతు కృషిచేస్తున్నానని ఈ సందర్భంగా దీపమ్మ చెప్పారు. ముఖ్యంగా, స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా రైతులు, మహిళలు, యువత సాధికారత కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు తనకు ఇవ్వడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలను మరింతగా విస్తరించే దిశగా ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని ఆమె పేర్కొన్నారు.




ట్రంక్ రోడ్, నెల్లూరు.




మా మిత్రుడు సుధీర్‌రెడ్డి సుదీర్ఘ శ్రమకి సముచిత గౌరవం

పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మెన్ స్థానం



ఆత్మీయ అభినందనలతో...

నంబూరు మోహన్‌రావు

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com